


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 212 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 7 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :212 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 7 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరిశిక్ష...
## మధురై కోర్టు సంచలన తీర్పు

- సాతంకుళం కస్టడీ మరణాల కేసులో సంచలన తీర్పు
- తొమ్మిది మంది పోలీసు అధికారులకు మరణ శిక్ష ఖరారు
- ఇది అత్యంత అరుదైన కేసు అని అభివర్ణించిన కోర్టు
- బాధిత కుటుంబానికి రూ.1.40 కోట్ల పరిహారం చెల్లించాలని ఆదేశం
- 2020లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటన ఇది

పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన తమిళనాడులోని సాతంకుళం కస్టడీ మరణాల కేసులో మధురై కోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. తండ్రీకొడుకులైన జయరాజ్, బెన్నిక్స్‌ల మృతికి కారణమైన తొమ్మిది మంది పోలీసులను దోషులుగా తేల్చి, వారికి మరణ శిక్ష విధించింది. సోమవారం మదురై మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి జి. ముత్తుకుమారన్ ఈ తీర్పును ప్రకటించారు. ఈ కేసును "అత్యంత అరుదైన కేసు" (రేర్ ఆఫ్ ది రేరెస్ట్)గా అభివర్ణించిన న్యాయమూర్తి, రక్షించాల్సిన పోలీసులే భక్షకులుగా మారారని

మిగతా 2లో





## కొత్త అస్త్రం బయటికి తీసిన ఇరాన్...

### అమెరికా, ఇజ్రాయెల్‌కు సవాల్!

- అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ కొత్త డ్రోన్
- 'హదీద్-110' పేరుతో స్టెల్త్ స్ట్రైక్ డ్రోన్ తయారీ
- షాహెద్ కంటే మూడు రెట్లు అధిక వేగంతో ప్రయాణం
- గంటకు 510 కి.మీ వేగంతో 350 కి.మీ పరిధిలో లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం
- మధ్యప్రాచ్యంలో డ్రోన్ యుద్ధంలో కొత్త దశకు సంకేతం

మిగతా 2లో

## ఒక్క దిక్కుమాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసింది



- యాడికిలో 'జలధార' 100 రోజుల యాక్షన్ ప్లాన్ విడుదల
- అమరావతే ఏకైక రాజధాని.. పిచ్చి ముదిరి మావిగన్ అంటున్నారన్న సీఎం
- పెట్టుబడులను అడ్డుకుంటున్నారని వైసీపీ నేతలపై తీవ్ర విమర్శలు
- జలధారతో ప్రతీ ఎకరాకు నీరు ఇస్తామని హామీ
- పూర్వోదయతో సీమకు మహర్దశ ఖాయమని ధీమా

పెన్ పవర్ డెస్క్:'పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే, అందులో 49 పార్టీలు అమరావతికి మద్దతు పలికితే, ఒక్క దిక్కుమాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసింది" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజధాని ఏదంటే 'అమరావతి' అని గర్వంగా చెప్పుకునే రోజు వచ్చిందని, గత పాలకులు ఆడిన మూడు ముక్కలాట ముగిసిందని అన్నారు. అనంతపురం జిల్లా యాడికిలో సోమవారం జరిగిన 'జలధార..

మిగతా 2లో





## ఏలూరు జిల్లాలో వర్షం, ఈదురుగాలుల బీభత్సం

- ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం
- గాలివానకు నేలరాలిన మామిడి, జీడి, అరటి, వరి పంటలు
- చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదన
- మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిక
- ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం, రైతులకు మాత్రం తీరని నష్టం

పెన్ పవర్ డెస్క్:ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గత మూడు రోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించినా, రైతులకు మాత్రం కన్నీళ్లను మిగిల్చింది. చేతికి అందివచ్చిన పంటలు నేలపాలు కావడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షానికి, బలమైన ఈదురు గాలులకు జనజీవనం స్తంభించింది.

మిగతా 2లో



## ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ...

### ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖదేమీ మృతి

- అమెరికా-ఇజ్రాయెల్ ఉమ్మడి దాడిలో ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి
- ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న దాడుల్లో పలువురు ఉన్నతాధికారుల మరణం
- దాడిని ధృవీకరించిన ఇరాన్ ప్రభుత్వం, ఐఆర్‌జీసీ
- ఈ ఘటనతో మరింత పెరగనున్న ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు

మిగతా 2లో

## మోదీ, అశ్విని వైష్ణవ్, చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్



- పవన్ కళ్యాణ్ చొరవతో అమృత్ భారత్ స్కీమ్‌లోకి పిఠాపురం రైల్వే స్టేషన్
- ఆధునికీకరణ పనుల కోసం రూ. 37.25 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ అయి ప్రాముఖ్యతను వివరించిన పవన్
- యాత్రికుల సౌకర్యార్థం స్టేషన్‌లో అత్యాధునిక వసతుల కల్పన

మిగతా 2లో

## 2 వేల మందితో మొదలై.. 2.80 లక్షల మందికి..!

### శ్రీవారి అన్నదానంపై సీఎం చంద్రబాబు ఆసక్తికర పోస్టు

- తిరుమల నిత్యాన్నదాన పథకానికి 39 వసంతాలు పూర్తి
- 2 వేల మందితో మొదలై నేడు 2.80 లక్షల మందికి అన్నప్రసాదం
- రూ.2,500 కోట్లు దాటిన శ్రీవారి అన్నప్రసాదం ట్రస్ట్ నిధులు
- దాతల సహకారం మరువలేనిదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- టీటీడీ పరిధిలోని 60 ఆలయాలకు పథకం విస్తరణ

మిగతా 2లో



## సీఎం విజయన్ ఏమైనా దైవాంశ సంభూతుడా?

- కేరళలో హోరాహోరీగా ఎన్నికల ప్రచారం
- సీఎం విజయన్ పై నిప్పులు చెరిగిన రాహుల్ గాంధీ
- ఆయన పాలనలో అహంకారం కనిపిస్తోందని విమర్శ
- కేరళలో బీజేపీ, లెఫ్ట్ పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆరోపణ
- మోదీని విమర్శిస్తే తనపై కేసులు, విజయన్‌పై ఎందుకు లేవని ప్రశ్న



పెన్ పవర్ డెస్క్:కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. విజయన్ ఏమీ దైవాంశ సంభూతుడు కాదని, ఆయన పాలనలో అహంకారం కనిపిస్తోందని అన్నారు. త్రిస్సూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన రాహుల్.. కేరళలో బీజేపీ, వామపక్షాల (ఎల్డీఎఫ్) మధ్య రహస్య అవగాహన ఉందని సంచలన ఆరోపణలు చేశారు.ప్రధాని నరేంద్ర మోదీని

మిగతా 2లో

## జగన్ ప్రతిపాదన అవినీతిపై ఎక్కు పెట్టిన 'గన్'లా ఉంది



- జగన్ మావిగన్ కాన్సెప్ట్‌తో చంద్రబాబులో వణుకు మొదలైందన్న కన్నబాబు
- తక్కువ ఖర్చుతో అద్భుతమైన రాజధానిని నిర్మించవచ్చనేది జగన్ ఆలోచన అని కితాబు
- జగన్ ఆలోచన కూటమి ప్రభుత్వానికి మింగుడు పడటం లేదని ఎద్దేవా
- ఏబీఎన్ రాధాకృష్ణ జగన్‌పై విషయం చిమ్ముతున్నారని మండిపాటు

మిగతా 2లో

## అమరావతిపై నీ కుట్రలు ఇక సాగవు జగన్

- వైసీపీ ఒక రాజకీయ పార్టీ కాదు.. అదొక డ్రామా కంపెనీ అంటూ అనురాధ ఫైర్
- దోపిడీకి, అభివృద్ధికి మధ్య తేడా తెలుసుకోవాలని హితవు
- ప్రజలు తిరస్కరించినా వైసీపీ తీరు మారడం లేదని ఆగ్రహం
- లోకేశ్ ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం జగన్‌కు లేదని విమర్శలు

మిగతా 2లో





## పాక్ సోషల్ మీడియా సమాచారంతోనే కాంగ్రెస్ నేతల ప్రెస్‌మీట్లు

### ప్రధాని మోదీ, అసోం సీఎం హిమంత

- ప్రతిపక్షం పాకిస్థాన్‌తో సంబంధాలు నెరపుతోందని ఆరోపణ
- కాంగ్రెస్ తీరుకు ఇప్పటికే దేశం పలుమార్లు మూల్యం చెల్లించుకుంటోందన్న మోదీ
- జాతీయ భద్రతకు ఇది పెను ప్రమాదమని ఆందోళన

మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## 2 వేల మందితో మొదలై.. 2.80 లక్షల మందికి..!

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన పథకం మరో మైలురాయిని అధిగమించింది. 1985 ఏప్రిల్ 6న అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రారంభించిన ఈ మహోన్నత కార్యక్రమం నేటితో 39 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం కేవలం 2 వేల మంది భక్తులతో మొదలైన ఈ సేవ, నేడు రోజుకు 2.80 లక్షల మందికి అన్నప్రసాదం అందించే స్థాయికి చేరడం విశేషం. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. భక్తుల భాగస్వామ్యం, దాతల సహకారంతో శ్రీ వెంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ మూల నిధి రూ.2,500 కోట్లు దాటిందని తెలిపారు. ఈ పథకం స్ఫూర్తితోనే ప్రాణదానం, విద్యాదానం వంటి ట్రస్టులను ఏర్పాటు చేసి టీటీడీ ద్వారా వైద్య, విద్యా రంగాల్లో సేవలు అందిస్తున్నామని వివరించారు.

ప్రస్తుతం టీటీడీ పరిధిలోని మరో 60 దేవాలయాలతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రముఖ ఆలయాల్లోనూ నిత్యాన్నదానం పథకాన్ని అమలు చేస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు జరిగిన ప్రగతిని వివరిస్తూ చంద్రబాబు సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలను కూడా పంచుకున్నారు. ఈ మహోన్నత కార్యక్రమానికి చేయూతనిస్తున్న దాతలకు ఆయన అభినందనలు, నమస్కారాలు తెలియజేశారు.

## సీఎం విజయన్ ఏమైనా దైవాంశ సంభూతుడా?

- మొదటి పేజి తరువాయి

విమర్శించినందుకు తనపై కేంద్ర ఏజెన్సీలు చర్యలు తీసుకున్నాయని, కానీ సీఎం విజయన్‌ను గానీ, ఆయన కుటుంబాన్ని గానీ ఎందుకు ప్రశ్నించడం లేదని రాహుల్ నిలదీశారు. ఈ పరిణామం బీజేపీ, లెఫ్ట్ నేతల మధ్య ఉన్న రాజకీయ ఒప్పందాన్ని బలపరుస్తోందని పేర్కొన్నారు. కేరళ పర్యటనల్లో ప్రధాని మోదీ మతపరమైన అంశాలు మాట్లాడతారని, కానీ శబరిమల స్మగ్లింగ్ వ్యవహారంపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆయన ప్రశ్నించారు. వామపక్షాలకు సహాయం చేసేందుకే మోదీ ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం విజయన్ ఫొటోలతో ఉన్న పోస్టర్లను ప్రస్తావిస్తూ, పాలన అంతా ఒక్కరే చేస్తున్నారనే అభిప్రాయాన్ని కల్పించడం రాజకీయ అహంకారమని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ తరహా ఏకవ్యక్తి నాయకత్వం ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మల పాలనలో కనిపిస్తుందని అన్నారు. కేరళలో పాలన సాగించేందుకు విజయన్ ఒక్కరే సమర్థుడని ప్రచారం చేసుకోవడం ప్రజలను అవమానించడమేనని రాహుల్ అన్నారు. వినయం, ప్రజల సానుభూతి ఉన్న ఎందరో నాయకులు రాష్ట్రంలో ఉన్నారని, ప్రజాస్వామ్య నాయకత్వానికి అణకువ అవసరమని హితవు పలికారు. కేరళలో అసలైన పోరాటం యూడీఎఫ్‌కు, బీజేపీ-ఎల్‌డీఎఫ్ కూటమికి మధ్యేనని ఆయన స్పష్టం చేశారు.

## అమరావతిపై నీ కుట్రలు ఇక సాగవు జగన్

వైసీపీ తీరు ఒక రాజకీయ పార్టీలా కాకుండా, ప్రజలను మభ్యపెట్టే 'డ్రామా కంపెనీ'లా తయారైందని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతి రాజధాని విషయంలో ఆ పార్టీ ఆడుతున్న నాటకాలు పరాకాష్ఠకు చేరాయని, 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు వ్యతిరేకంగా జగన్ చేస్తున్న కుట్రలు ఇకపై సాగవని ఆమె హెచ్చరించారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వైసీపీ నేతల ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు.

**అసలు దోపిడీ అంటే ఏంటో తెలుసా?**

అమరావతిలో దోపిడీ జరుగుతోందని జగన్ ఆరోపించడంపై అనురాధ తీవ్రంగా మండిపడ్డారు. "జగన్ గారూ.. అసలు దోపిడీకి, అభివృద్ధికి మధ్య ఉన్న తేడా మీకు తెలుసా?" అని ఆమె ప్రశ్నించారు. అసలైన దోపిడీ అంటే ఏంటో వివరిస్తానంటూ ఆమె పలు ఉదాహరణలు ఇచ్చారు. "తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని క్విడ్ ప్రో కో పద్ధతిలో వేల కోట్లు సంపాదించడాన్ని దోపిడీ అంటారు. అక్రమ ఆస్తుల కేసుల్లో ఇరుక్కుని ఏళ్ల తరబడి బెయిల్ మీద తిరగడాన్ని దోపిడీ అంటారు. వెంకట నరసయ్య అనే చేనేత కార్మికుడిని ముగ్గు గనుల కోసం పొట్టనబెట్టుకోవడాన్ని, 'సాక్షి' మీడియాను అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేయడాన్ని, భారతి సిమెంట్స్ కోసం నిబంధనలు ఉల్లంఘించడాన్ని దోపిడీ అంటారు" అంటూ నిప్పులు చెరిగారు.

**మద్యం, భూముల కుంభకోణాలపై విమర్శలు**

"మద్యపాన నిషేధం అని చెప్పి, జే-బ్రాండ్ల మద్యాన్ని అమ్ముతూ డిజిటల్ చెల్లింపులు లేకుండా నెలకు రూ.100 కోట్లకు పైగా బ్లాక్ మనీని జేబులో వేసుకోవడాన్ని ఏమంటారు? ఉత్తరాంధ్రను ఉద్ధరిస్తామని చెప్పి, విశాఖలో 41 వేల ఎకరాల భూములను కొట్టేయడాన్ని దోపిడీ అంటారు. పందికొక్కుల్లా ఎర్రచందనాన్ని స్మగ్లింగ్ చేయడం, ఇసుకను బంగారం చేసి పేదల ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడం వంటివన్నీ దోపిడీ కాదా?" అని అనురాధ ప్రశ్నించారు. అన్యమతస్తులను టీటీడీ చైర్మన్‌లుగా నియమించి, స్వామివారి సొమ్మును కొల్లగొట్టిన పాపం మిమ్మల్ని వెంటాడుతోందని ఆమె వ్యాఖ్యానించారు.

**అభివృద్ధిని అడ్డుకుంటున్న కుట్రలు**

అమరావతి అభివృద్ధిని ప్రపంచమంతా ప్రశంసిస్తుంటే, వైసీపీ నేతలు మాత్రం బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని అనురాధ ఆగ్రహం వ్యక్తం చేశారు. "అంతర్జాతీయ యూనివర్సిటీలు, ఐటీ కంపెనీలు వస్తుంటే అడ్డుకోవడం మీ అవివేకం కాదా? పదేళ్లయినా రాజధాని లేదని దేశమంతా జాలి పడుతుంటే, మీకు మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదు" అని విమర్శించారు. రాజధానిని ఎలా దెబ్బతీయాలా అనే కుట్రతోనే వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారితో ప్రెస్ మీట్లు పెట్టించి విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

**లోకేశ్ ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా?**

గతంలో ముఖ్యమంత్రిగా జగన్ ఎన్ని అబద్ధాలు ఆడారో, ఎన్ని యూ-టర్న్‌లు తీసుకున్నారో నారా లోకేశ్ వీడియో సాక్ష్యాలతో సహా బయటపెట్టారని అనురాధ గుర్తుచేశారు. "లోకేశ్ గారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం మీకు ఉందా? అమరావతిపై అసెంబ్లీలో మాట్లాడిన మాటలకు, ఇప్పుడు చేస్తున్న కుట్రలకు పొంతన లేదని ఆయన ట్వీట్ చేస్తే బదులివ్వలేకపోయారు" అని ఆమె అన్నారు. 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతుల గొప్పతనాన్ని ఓర్వలేకే ఈ కక్ష సాధింపు చర్యలని దుయ్యబట్టారు.

**ప్రజలు తిరస్కరించినా మారని వైఖరి**

ప్రజలు కేవలం 11 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా తిరస్కరించినా వైసీపీ తీరు మారలేదని అనురాధ విమర్శించారు. "పార్టీని ఎలా బాగు చేసుకోవాలో ఆలోచించకుండా, ఇంకా అమరావతిపై విషం చిమ్ముతున్నారు. మీ సైకో తత్వాన్ని పక్కనపెట్టి వాస్తవాలు మాట్లాడటం నేర్చుకోండి. అభివృద్ధిని అడ్డుకున్న పాపం మిమ్మల్ని వదిలిపెట్టదు" అని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర రాజధానిపై విషం చిమ్మడం ఆపకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, ప్రతి కుట్రకు తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదని ఆమె స్పష్టం చేశారు.

# ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరిశిక్ష...

- మొదటి పేజి తరువాయి

తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో దోషులుగా తేలిన వారిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు పి. రఘు గణేశ్, కె. బాలకృష్ణన్, హెడ్ కానిస్టేబుల్స్ ఎస్. మురుగన్, ఏ. సామిదురై, కానిస్టేబుల్స్ ఎం. ముత్తురాజ్, ఎస్. చెల్లదురై, థామస్ ఫ్రాన్సిస్, ఎస్. వెయిలుముత్తు ఉన్నారు. విచారణ సమయంలో పదో నిందితుడైన రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్‌దురై కోవిడ్‌తో మరణించాడు.

కేసు నేపథ్యం: 2020 జూన్ 19న, కోవిడ్-19 లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 9 గంటల తర్వాత దుకాణం తెరిచి ఉంచారనే ఆరోపణలతో సాతంకుళం పోలీసులు వ్యాపారులైన పి. జయరాజ్, ఆయన కుమారుడు బెన్నిక్స్‌ను అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో వారిని అత్యంత అమానుషంగా, క్రూరంగా హింసించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తీవ్ర గాయాలపాలైన వారిపై తప్పుడు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ హింస కారణంగా బెన్నిక్స్ జూన్ 22న, జయరాజ్ జూన్ 23న చికిత్స పొందుతూ మరణించారు. ఎలాంటి నేరచరిత్ర లేని వారి మరణం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. మొదట మదురై హైకోర్టు సుమోటోగా కేసును స్వీకరించగా, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. సీబీఐ విచారణలో పోలీసుల దారుణాలు బయటపడ్డాయి.

పోస్ట్‌మార్టం నివేదికలు కూడా వారిద్దరి మరణానికి తీవ్రమైన గాయాలే కారణమని స్పష్టం చేశాయి. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, మార్చి 23న తొమ్మిది మందిని దోషులుగా నిర్ధారించి, సోమవారం వారికి శిక్ష ఖరారు చేసింది. దోషులందరికీ మరణ శిక్షతో పాటు, బాధిత కుటుంబానికి రూ. 1.40 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

# ఒక్క దిక్కుమాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసింది

- మొదటి పేజి తరువాయి

నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమరావతి పేరు పలకడానికి కూడా ఇష్టం లేని కొందరు పిచ్చి ముదిరి 'మావిగన్' అంటూ కొత్త పేరుతో పిలుస్తున్నారని, వారి ఫ్రస్టేషన్ చూస్తుంటే జాలి వేస్తోందని ఎద్దేవా చేశారు.

**రాష్ట్రానికి ద్రోహం చేసిన ఏకైక పార్టీ వైసీపీ**

గత ప్రభుత్వ వైఖరిని దుయ్యబడుతూ, రాష్ట్రంపై పగ పట్టినట్లుగా వ్యవహరించారని చంద్రబాబు ఆరోపించారు. "బాబాయిని చంపి నా చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారు. అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే చూసి సహించలేక అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నారు. ఫ్యాక్షనిస్టులు, ముఠా నాయకుల కంటే ఘోరంగా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారు" అని మండిపడ్డారు. రాష్ట్రానికి రాజధాని అమరావతేనని పార్లమెంట్ చట్టబద్ధత కల్పించడంపై సీమ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, సభకు హాజరైన ప్రజలు 'జై అమరావతి' నినాదాలతో తమ మద్దతు తెలిపారని గుర్తుచేశారు.

**పెట్టుబడులు వస్తుంటే ఓర్వలేకపోతున్నారు**

గత పాలకులు రాష్ట్రంపై విద్వేషం చూపిస్తున్నారని, పెట్టుబడులు వస్తుంటే వారిని బెదిరించి తరిమేస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. దేవాలయాలపై దాడులు చేసి, తిరుమల ప్రసాదం నాణ్యతను కల్తీ నెయ్యితో దెబ్బతీశారు. ఇలాంటి వారికి సహకరిస్తే ప్రజలందరికీ నష్టం జరుగుతుంది," అని హెచ్చరించారు. గత ప్రభుత్వం పెంచిన రూ.4,400 కోట్ల విద్యుత్ భారాన్ని కూడా కూటమి ప్రభుత్వమే భరిస్తోందని, తొలిసారి ట్రూ డౌన్ చేసిన ఘనత తమదేనని స్పష్టం చేశారు.

**జలధారతో ప్రతీ ఎకరాకు నీరు**

అంతకుముందు, 'జలధార' కార్యక్రమం కింద 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను, 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. నీరే సంపద అని, దాన్ని పొదుపుగా వాడితేనే సంపద సృష్టించగలమని అన్నారు. "పరిగెత్తే నీటిని నిలబెట్టాలి, నిలబడిన నీటిని జలాశయాల్లో నిల్వ చేయాలి. నీరు-చెట్టు, పంట కుంటలు, డ్రిప్ ఇరిగేషన్ వంటి కార్యక్రమాలతో గతంలోనే నీటి సంరక్షణకు బాటలు వేశాం. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందించి రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చాం. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు వ్యయం చేస్తూ దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం," అని వివరించారు.

**పూర్వోదయతో సీమకు మహర్దశ**

రాయలసీమ అభివృద్ధికి ఒక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని, కేంద్రం ప్రవేశపెట్టిన 'పూర్వోదయ' పథకం ద్వారా రూ.30 వేల కోట్లు, పెట్టుబడుల ద్వారా మరో రూ.70 వేల కోట్లు సమీకరించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. "గడిచిన 21 నెలల్లో చేపట్టిన జలసంరక్షణ చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు 1.92 మీటర్ల మేర పెరిగాయి. ఒక్క అనంతపురం జిల్లాలోనే 2.2 మీటర్ల పెరుగుదల కనిపించింది. 20 వేలకు పైగా ఎండిన బోర్లలో నీళ్లు వచ్చాయి. రూ.96 కోట్ల విద్యుత్ ఆదా అయ్యింది" అని తెలిపారు. శ్రీశైలం నుంచి ఎత్తిపోతల ద్వారా నీరు తెచ్చి, పట్టిసీమ నీటిని కృష్ణా డెల్టాకు ఇచ్చి, ఆదా చేసిన నీటిని సీమకు తరలించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, స్థానిక ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి, ఎంపీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మోదీ, అశ్విని వైష్ణవ్, చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ చేసిన కృషి ఫలించింది. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన పిఠాపురం రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' పరిధిలోకి పిఠాపురం స్టేషన్‌ను చేర్చుతూ రైల్వే మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేషన్ అభివృద్ధి, ఆధునికీకరణ పనుల కోసం రూ. 37.25 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిధులతో పిఠాపురం స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. కొద్ది నెలల క్రితం తన ఢిల్లీ పర్యటనలో భాగంగా, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి ఆవశ్యకతను ఆయనకు సమగ్రంగా వివరించారు. పురాణ ప్రాధాన్యం ఉన్న పిఠాపురం పట్టణానికి దేశంలోని సుదూర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తుంటారని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పవన్ కల్యాణ్ నొక్కిచెప్పారు. అమృత్ భారత్ పథకం కింద స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే యాత్రికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆయన విజ్ఞప్తి చేశారు. నిజానికి, పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధిపై పవన్ కల్యాణ్ మొదటి నుంచి ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో పిఠాపురంలో పర్యటించినప్పుడు ఆయన క్షేత్రస్థాయిలో స్టేషన్‌ను పరిశీలించారు. ఆ సమయంలో స్టేషన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, దుర్గంధం వెదజల్లడం గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఆనాడే స్టేషన్ రూపురేఖలు మార్చాలని ఆయన నిశ్చయించుకున్నారు. పవన్ కల్యాణ్ అభ్యర్థన పట్ల కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడంతో, ఇక పిఠాపురం స్టేషన్ సర్వాంగ సుందరంగా ముస్తాబు కానుంది. ఈ నిధులతో స్టేషన్ ప్రధాన భవనం, ముఖద్వారం నిర్మాణం, ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధి, కొత్త షెల్టర్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నారు. వీటితో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలతో కూడిన విశ్రాంతి గది, అత్యాధునిక టాయిలెట్లు, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, కేబులింగ్ పనులను కూడా పూర్తి చేయనున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. తాను అడిగిన వెంటనే పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఆమోదం తెలిపి, నిధులు మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, తక్షణం స్పందించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం మద్దతు ఇస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు కూడా పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు.

# కొత్త అస్త్రం బయటికి తీసిన ఇరాన్...

మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఇరాన్ తన సైనిక పాటవాన్ని ప్రదర్శిస్తూ ఓ సరికొత్త స్టెల్త్ స్ట్రైక్ డ్రోన్‌ను బయటికి తీసింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) అభివృద్ధి చేసిన ఈ డ్రోన్‌కు 'హదీద్-110' అని పేరు పెట్టారు. ఇది ఇప్పటికే యుద్ధరంగంలో వినియోగంలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి రాడార్లకు చిక్కకుండా, వేగంగా దూసుకెళ్లి లక్ష్యాలను ధ్వంసం చేసేలా దీన్ని రూపొందించినట్లు ఇరాన్ అధికారిక మీడియా సంస్థ తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ ఓ వీడియోలో వెల్లడించింది. ఈ కొత్త డ్రోన్ ఇరాన్ డ్రోన్ టెక్నాలజీలో ఒక ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది సూసైడ్ డ్రోన్ తరహాలో పనిచేస్తుంది. అంటే, లక్ష్యాన్ని చేరుకుని, తనను తాను పేల్చుకుని విధ్వంసం సృష్టిస్తుంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్లు, కమాండ్ సెంటర్లు, కీలకమైన మౌలిక సదుపాయాలే దీని ప్రధాన లక్ష్యాలు. ఇరాన్ ఇప్పటివరకు వినియోగిస్తున్న షాహెద్-136 డ్రోన్‌తో పోలిస్తే, హదీద్-110 దాదాపు మూడు రెట్లు వేగవంతమైనది కావడం గమనార్హం. ఇది గంటకు సుమారు 510 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. హదీద్-110 డ్రోన్‌లో 30 కిలోల బరువున్న శక్తివంతమైన పేలుడు పదార్థాలను (హై ఎక్స్‌ప్లోసివ్ వార్‌హెడ్) అమర్చవచ్చు. దీని పరిధి సుమారు 350 కిలోమీటర్లు కాగా, దాదాపు గంటపాటు గాలిలో ఎగరగలదు. కాంపాక్ట్ జెట్ ఇంజిన్‌తో పనిచేసే ఈ డ్రోన్, డెల్టా-వింగ్ డిజైన్‌ను కలిగి ఉంది. ఈ ప్రత్యేక ఆకృతి వల్లే రాడార్ సిగ్నల్స్‌కు సులభంగా చిక్కకుండా (తక్కువ రాడార్ క్రాస్-సెక్షన్) స్టెల్త్ సామర్థ్యాలను ప్రదర్శిస్తుంది. దీన్ని నేరుగా కాటపల్ట్ ద్వారా గాల్లోకి ప్రయోగించి, ఆ తర్వాత జెట్ ఇంజిన్‌ను స్టార్ట్ చేసి ముందుకు పంపిస్తారు. ఇప్పటికే ఈ డ్రోన్‌ను ఉపయోగించి అమెరికా సైనిక స్థావరాలు లేదా సంబంధిత లక్ష్యాలపై తొలి దాడులు జరిగాయని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. షాహెద్ వంటి నెమ్మదైన డ్రోన్లను ఎదుర్కోవడానికి అలవాటుపడిన అమెరికా, ఇజ్రాయెల్ వంటి దేశాల రక్షణ వ్యవస్థలకు ఈ వేగవంతమైన స్టెల్త్ డ్రోన్ కొత్త సవాలుగా మారింది. హదీద్-110 రాకతో మధ్యప్రాచ్యంలో డ్రోన్ యుద్ధ తంత్రంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని, ఇది ప్రాంతీయ భద్రతా సమీకరణాలను మరింత క్లిష్టతరం చేస్తుందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## జగన్ ప్రతిపాదన అవినీతిపై ఎక్కుపెట్టిన 'గన్'లా ఉంది

వైసీపీ అధినేత జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' కాన్సెప్ట్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబులో వణుకు మొదలైందని మాజీ మంత్రి కన్నబాబు విమర్శించారు. విశాఖపట్నంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో అద్భుతమైన రాజధానిని నిర్మించవచ్చనే జగన్ ఆలోచన కూటమి ప్రభుత్వానికి మింగుడు పడటం లేదని ఎద్దేవా చేశారు. అమరావతి కోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం... మరోవైపు రాష్ట్రంలో జీతాలకు కూడా డబ్బులు లేవని ఆర్థిక మంత్రి ద్వారా చెప్పించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అమరావతిపై చంద్రబాబు చేస్తున్న ఖర్చు కేవలం అవినీతి కోసమేనని, జగన్ ప్రతిపాదన ఆ అవినీతిపై ఎక్కుపెట్టిన 'గన్'లా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎంపీ రేణుక చౌదరి అమరావతిని 'కమ్మరావతి' అని సంబోధించినా కూటమి నేతలు ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. ఏబీఎన్ రాధాకృష్ణ తన రాతల ద్వారా జగన్‌పై విషం చిమ్ముతున్నారని, జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారనే భయమే వారిని ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పురిగొల్పుతోందని కన్నబాబు వ్యాఖ్యానించారు.

# ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ...

## ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖదేమీ మృతి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలో ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఇంటెలిజెన్స్ చీఫ్, మేజర్ జనరల్ సయ్యద్ మజీద్ ఖదేమీ మరణించారు. సోమవారం తెల్లవారుజామున ఈ దాడి జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ ఘటనపై ఐఆర్‌జీసీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇది నేరపూరిత ఉగ్రవాద దాడి అని, ఈ దాడిలో ఖదేమీ 'షహీద్' (అమరుడు) అయ్యారని పేర్కొంది. అయితే, దాడి ఎక్కడ జరిగిందనే ప్రదేశాన్ని మాత్రం ఐఆర్‌జీసీ వెల్లడించలేదు. ఇరాన్ భద్రతా వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన నిఘా విభాగానికి ఖదేమీ నాయకత్వం వహిస్తున్నారు. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి జరుగుతున్న దాడుల్లో ఇరాన్ అనేక మంది ఉన్నతాధికారులను కోల్పోయింది. గత నెలలోనే ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ, ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్‌లను ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయి. అంతకుముందు ఐఆర్‌జీసీ చీఫ్ మహమ్మద్ పక్‌పూర్, బసీజ్ ఫోర్స్ చీఫ్ ఘోలామ్‌రెజా సొలైమానీ వంటి కీలక నేతలు కూడా ఈ దాడుల్లో మరణించారు. ఫిబ్రవరి 28న జరిగిన తొలి దాడిలోనే ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ మరణించడం తెలిసిందే. ప్రస్తుతం ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన్ను కూడా లక్ష్యంగా చేసుకుంటామని అమెరికా, ఇజ్రాయెల్ హెచ్చరించింది.

## ఏలూరు జిల్లాలో వర్షం, ఈదురుగాలుల బీభత్సం

- మొదటి పేజి తరువాయి

జంగారెడ్డిగూడెం సమీపంలోని వేగవరం ప్రధాన రహదారిపై ఓ భారీ వృక్షం విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గాలివాన ధాటికి మామిడి, జీడి తోటల్లో కాయలు పెద్ద ఎత్తున నేలరాలాయి. మరో నెల రోజుల్లో కోత కోసి మార్కెట్‌కు తరలించాల్సిన మామిడి పంట కళ్ల ముందే దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మామిడితో పాటు కోతకు సిద్ధంగా ఉన్న వరి, అరటి, జీడిమామిడి వంటి ఇతర పంటలు కూడా తీవ్రంగా నష్టపోయాయని రైతులు వాపోతున్నారు. లక్షల్లో పెట్టుబడి పెట్టి, కష్టపడి పండించిన పంట ఇలా అకాల వర్షానికి నాశనం కావడం తమను ఆర్థికంగా కుంగదీసిందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా అధికారులు పంట నష్టంపై అంచనాలు రూపొందించి, ప్రభుత్వానికి నివేదిక పంపిన తర్వాత రైతులకు నష్టపరిహారం అందే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతుల్లో ఆందోళన మరింత పెరిగింది.

# పాక్ సోషల్ మీడియా సమాచారంతోనే కాంగ్రెస్ నేతల ప్రెస్‌మీట్లు

కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాకిస్థాన్ సోషల్ మీడియా సమాచారం ఆధారంగా ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ భారత ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. ప్రతిపక్షం పాకిస్థాన్‌తో సంబంధాలు నెరపుతోందని ఆరోపించారు. అసోంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, దేశ భద్రతపై ప్రతిపక్షం వ్యవహరిస్తున్న తీరుకు ఇప్పటికే పలుమార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా కాంగ్రెస్ పాకిస్థాన్ పాటనే పాడిందని మండిపడ్డారు. ఈ సంబంధం ఎప్పటి నుంచో సాగుతోందని అన్నారు. జాతీయ భద్రతకు ఇది పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నాయకులపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఇటీవల రెండు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారని, ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వారు పాకిస్థాన్ సామాజిక మాధ్యమాల నుంచి తీసుకున్నట్లు గుర్తించామని ఆరోపించారు. నిన్న పవన్ ఖేరా, గౌరవ్ గొగోయ్ ఢిల్లీలో, గౌహతిలో రెండు మీడియా సమావేశాలు నిర్వహించారని తెలిపారు. ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ సందర్భంగా వారు మాట్లాడిన సమాచారం పాక్ సోషల్ మీడియా నుంచి తీసుకున్నదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసోంలో ఎన్నికలను ప్రభావితం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు పడుతున్న సమయంలో పాకిస్థాన్ ఛానల్ 11 టాక్ షోలు నిర్వహించిందని, ఇలా ఇంతకుముందు ఎప్పుడూ జరగలేదని తెలిపారు. ఈ ప్రతి టాక్ షోలోనూ కాంగ్రెస్ గెలవాలని పాకిస్థాన్ మీడియా కోరుకుందని వెల్లడించారు.

**కాంగ్రెస్ ఆరోపణలపై ముఖ్యమంత్రి ఆగ్రహం**

హిమంత బిశ్వశర్మ భార్యకు మూడు దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, దీనితో పాటు ఆమె ఆస్తులను అఫిడవిట్‌లో పేర్కొనలేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ ఆరోపణలపై హిమంత బిశ్వ శర్మ తీవ్రంగా స్పందించారు. సాక్ష్యం లేకుండా తప్పుడు ఆరోపణలు చేసినందుకు కేసు నమోదు చేయవచ్చని అన్నారు. ఎన్నికల సమయంలో కావాలని ఇలాంటి ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఇందుకు కాంగ్రెస్ శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. తనపై చేసిన ఆరోపణలకు గాను తన భార్య కేసు పెట్టినట్లు హిమంత బిశ్వశర్మ తెలిపారు. పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని అన్నారు.

# మానవత్వం చాటుకున్న విజయనగరం కలెక్టర్



**విజయనగరం టౌన్, పెన్ పవర్, ఏప్రిల్ 06:** విజయనగరం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఒక అభ్యర్థి సమస్యపై జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి స్పందించిన విధానం అందరి దృష్టిని ఆకర్షించింది. కొత్తవలస మండలం ఉత్తరాపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడైన సబ్బవరపు పోతురాజు తన సమస్యను తెలియజేయడానికి కలెక్టరేట్‌కు వచ్చారు. పోర్టికో వద్ద ఆయనను గమనించిన కలెక్టర్ నేరుగా ఆయన వద్దకు వెళ్లి దరఖాస్తును స్వీకరించారు. పోతురాజు తన సమస్యను వివరించగా, కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. వారికి వీల్ చైర్ ఏర్పాటు చేయించి పిజిఆర్ఎస్ వేదిక వద్దకు పంపించారు. ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించి, ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పరిపాలన యంత్రాంగం కట్టుబడి ఉండాలని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేసారు.

పెన్ పవర్

ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చన్న నాయుడు





**సంతబొమ్మాలి, పెన్ పవర్ ఏప్రిల్ 6 :** సంతబొమ్మాలి మండలం నౌపడ లోని మూలపేట పోర్టు నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ కాలనీలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సందర్శించారు. అంతకుముందు నీటి భద్రత సాగు నీటి సంఘాలు బాధ్యత కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. పోర్టు నిర్వాసితుల కాలనీల్లో ప్రధానంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గుర్తించిన మంత్రి, మరో 90 రోజుల్లో తాగునీటి సౌకర్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కాలనీలో ఉప్పునీరు మాత్రమే అందుబాటులో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీటి భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. మానవాళికి అత్యంత అవసరమైనది నీరేనని, ప్రతి గ్రామంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వర్షపు నీటిని వృథా కాకుండా నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెంచాలని, చెరువులు నింపాలని సూచించారు. రాష్ట్రంలోని 60 వేల నీటి సంఘాలు, 100 రోజుల వ్యవధిలో క్షేత్ర స్థాయిలో పర్యటించి భూగర్భ జలాలు పెరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలను గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం అనేక గ్రామాల్లో 300 అడుగుల లోతుకు వెళ్లినా నీరు దొరకడం లేదన్నారు. మూడు నెలల్లో వర్షాకాలం ప్రారంభమయ్యే నేపథ్యంలో కనీసం మూడు మీటర్ల లోపలే నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. "భూమిలో నీరు ఉంటే అది రిజర్వ్ బ్యాంక్ లాంటిది" అని మంత్రి వ్యాఖ్యానించారు. శ్రీకాకుళం జిల్లాలో గతంలో నిర్మించిన ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నాయో పరిశీలించి, అవసరమైతే వాటిని మరమ్మతు చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు సాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీటి సరఫరా కోసం ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వంశధార ప్రాజెక్టుపై మాట్లాడిన మంత్రి, 2014-19 మధ్య కాలంలో రిజర్వాయర్ పనుల్లో 96 శాతం పూర్తిచేశామని తెలిపారు. రిజర్వాయర్ కోసం ఐదు గ్రామాలను ఖాళీ చేయించి రూ.500 కోట్లు చెల్లించామని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం తరువాత వచ్చిన ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. నేరడి బ్యారేజ్ వివాదం 30 సంవత్సరాలుగా కొనసాగుతుండగా, తమ ప్రభుత్వం కోర్టులో 18 నెలలు పోరాడటంతో ట్రిబ్యునల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చెప్పారు. ఇది శ్రీకాకుళం జిల్లాకు గొప్ప విజయమని, ఈ అంశంపై వైసీపీ నాయకులు ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో భారీ అవినీతి జరిగిందని, కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. ఇప్పుడు బిల్లులు క్లియర్ చేసి పనులను తిరిగి ప్రారంభిస్తున్నామని చెప్పారు. నేరడి బ్యారేజ్ నిర్మాణం పూర్తైతే లిఫ్ట్ ఇరిగేషన్ అవసరం తగ్గుతుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజా ధనాన్ని వృథా చేసిందని, కానీ తమ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వృథా చేయదని మంత్రి స్పష్టం చేశారు. గతంలో మూలపేట పోర్టు నిర్వాసితులను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. ప్రస్తుతం దేవునల్తాడ నుంచి పైపుల ద్వారా వంశధార నీటిని తాగునీటిగా అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెందుర్తిలో చెరువుల కబ్జాల పర్వం!





- ప్రజలకు ముప్పు, అధికారులపై అనుమానాలు!
- చెరువులు మాయమవుతున్నాయా?
- రియల్ ఎస్టేట్ మాఫియా హవా!
- అధికారుల పాత్రపై అనుమానాలు!
- పాలకపక్షాల అండదండలు?
- వర్షాకాలంలో పెరుగుతున్న ప్రమాదం!
- ప్రజా సంఘాల పోరాటం -- ఫలితం శూన్యం!
- సుప్రీంకోర్టు హెచ్చరికలకూ లెక్కలేదా?

**పెందుర్తి, పెన్ పవర్, ఏప్రిల్ 6 :** స్థానిక పెందుర్తి నియోజకవర్గంలో ప్రభుత్వ చెరువులు, గెడ్డలపై భారీస్థాయిలో ఆక్రమణలు జరుగుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఈ భూబాగోతం ఇప్పుడు పట్టణ భవిష్యత్తుకే ముప్పుగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెందుర్తి పరిధిలోని చిన్నముసిడివాడ, ప్రకాష్ నగర్, సుజాతనగర్, గణేష్ నగర్, కృష్ణరాయపురం, వేపగుంట, లక్ష్మీపురం, రామ్‌పురం, పాపరాజుపాలెం వంటి ప్రాంతాల్లో పదుల సంఖ్యలో చెరువులు ఆక్రమణకు గురై కనుమరుగవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్ల విలువైన ప్రభుత్వ భూములు, నీటి వనరులు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి బలి అవుతున్నాయని సమాచారం. స్థానికంగా జిరాయితీ భూములు కొంత కొనుగోలు చేసి, పక్కనే ఉన్న చెరువులను కూడా ఆక్రమించి లేఅవుట్లు వేయడం, ప్లాట్లు అమ్మడం సాధారణంగా మారిందని చెబుతున్నారు. రెవెన్యూ రికార్డులను మార్పులు చేసి అక్రమ రిజిస్ట్రేషన్లు జరిపిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. చెరువుల పరిరక్షణ బాధ్యత ఉన్న రెవెన్యూ అధికారులు సైతం ఈ దందాలో భాగస్వాములయ్యారన్న విమర్శలు వస్తున్నాయి. వందల సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

రియల్ ఎస్టేట్ మాఫియాకు స్థానిక రాజకీయ నాయకులు, అధికారపక్ష మద్దతు ఉందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ కాలంలో ప్రారంభమైన ఈ అక్రమాలు ప్రస్తుత పాలనలో కూడా కొనసాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. చెరువులు కనుమరుగవడంతో వర్షపు నీటి పారుదల వ్యవస్థ దెబ్బతింది. ఫలితంగా:

లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి

ప్రధాన రహదారులు జలమయం అవుతున్నాయి. పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది భవిష్యత్తులో భారీ వరదల ముప్పుకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సీపీఎం, సీపీఐ మరియు ఇతర ప్రజా సంఘాలు చెరువుల పరిరక్షణ కోసం పోరాటాలు చేపడుతున్నాయి. జిల్లా అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. చెరువుల ఆక్రమణలు చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టంగా హెచ్చరించినప్పటికీ, స్థానిక స్థాయిలో అవి పట్టించుకోకపోవడం పరిస్థితి తీవ్రతను చూపుతోంది.

ప్రజల డిమాండ్లు. స్థానికులు మరియు ప్రజా సంఘాలు ప్రభుత్వం ముందు ఈ ప్రధాన డిమాండ్లు ఉంచుతున్నారు. ఆక్రమణకు గురైన చెరువులపై సమగ్ర సర్వే, అక్రమ నిర్మాణాల తొలగింపు, బాధ్యులపై కఠిన చర్యలు,

చెరువుల పునరుద్ధరణ చర్యలు, పెందుర్తి నియోజకవర్గంలో చెరువుల కబ్జాలు కేవలం పట్టణాభివృద్ధి, ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యగా మారింది. వెంటనే చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# విశాఖలో మృత్యు'ఘోష

### జనాభా పెరుగుదల కోరుతున్న ప్రభుత్వం.

### ప్రాణాలు తీస్తున్న వ్యవస్థ!

**విశాఖ, పెన్ పవర్, ఏప్రిల్ 06 :** ఒకవైపు దేశాభివృద్ధికి జనాభా అవసరమని, "ముగ్గురు ముద్దు" అంటూ ప్రభుత్వం కొత్త పల్లవి అందుకుంటుంటే.మరోవైపు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖపట్నంలో సామాన్యుడి 'బతికే హక్కు' కాలరాయబడుతోంది. నగరాన్ని వరుస ప్రమాదాలు చుట్టుముడుతున్నాయి. రోడ్డు ఎక్కితే ప్రాణాలతో తిరిగి వస్తామో లేదో తెలియని దారుణ పరిస్థితి నెలకొంది. ఈ మర ణాలు ప్రమాదవశాత్తు జరుగుతున్నవా? లేక ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న 'హత్యలా'? అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రమాదాలకు అసలు కారణాలు ఇవేనా?

నగరంలో వాహనాల సంఖ్య లక్షల్లో పెరుగుతుం టే, రోడ్ల పరిస్థితి మాత్రం దశాబ్దాల క్రితం నాటి దే. అభివృద్ధి అంటే కేవలం రంగులు పూయడ మేనా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ప్రధానంగా మూడు అంశాలు నగరవాసుల ప్రాణాలను హరిస్తున్నాయి.

ఆక్రమణల పర్వం

ఫుట్‌పాత్‌లు పాదచారుల కోసం కాక, వ్యాపార సంస్థల ఆక్రమణలకు అడ్డాగా మారాయి. దీంతో ప్రజలు ప్రాణాలకు తెగించి రోడ్డు మధ్యలో నడ వాల్సి వస్తోంది.

పార్కింగ్ మాఫియా

నగరంలోని మెజారిటీ వాణిజ్య సముదాయా ల్లో సెల్లార్ పార్కింగ్‌లు లేవు. ఉన్నా వాటిని గో డౌన్లుగా వాడుతున్నారు. ఫలితంగా వాహనాల న్నీ రోడ్ల మీదే పార్క్ చేస్తుండటంతో ట్రాఫిక్ ఇరు కై ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

నిర్లక్ష్యపు రోడ్లు

పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్ల విస్తరణ జరగకపోవడం, ఉన్న రోడ్లపై గుంతలు మృత్యు పాశాలుగా మారుతున్నాయి.

వైఫల్యం ఎవరిది?

ఈ ఘోరాలకు బాధ్యులు ఎవరనే ప్రశ్నపై సర్వ త్రా చర్చ జరుగుతోంది.ప్రభుత్వ యంత్రాంగం

నిబంధనలు ఉల్లంఘించి కట్టిన భవనాలపై జీవీఎంసీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

ఫుట్‌పాత్ ఆక్రమణలను ఎందుకు తొలగించ డం లేదు? కేవలం ట్యాక్సుల వసూళ్ల పై ఉన్న శ్రద్ధ ప్రజల భద్రతపై లేకపోవడం స్పష్టమైన యంత్రాంగ వైఫల్యమే.

ప్రజల అవగాహన

ట్రాఫిక్ నియమాల పట్ల ప్రజల్లో కనీస అవగాహ న లేకపోవడం, అతివేగం, సిగ్నల్ జంపింగ్ వంటి వి కూడా ప్రాణసంకటంగా మారుతున్నాయి.




ప్రభుత్వం జనాభా పెంచాలని పిలుపునివ్వడం కాదని, ముందు ఉన్న జనాభాను కాపాడుకోవా లని మేధావులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం నిద్ర మేల్కొని, రోడ్ల విస్తరణ, ఆక్ర మణల తొలగింపుపై దృష్టి సారించకపోతే. విశా ఖ 'మృత్యు నగరం'గా మారే ప్రమాదం ఉందని నగరవాసులు హెచ్చరిస్తున్నారు.

# పరీక్షల విశ్వసనీయతకు భంగం కలగకుండా మూల్యాంకన చేయండి

## --పదవ తరగతి ప్రశ్నపత్రాల మూల్యాంకన కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

**విజయనగరం టౌన్, పెన్ పవర్, ఏప్రిల్ 06:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాల మూల్యాంకనం పారదర్శకంగా, సమయపాలనతో నిర్వహించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పిఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ సబ్జెక్టులకు సంబంధించిన స్క్రిప్టుల మూల్యాంకన ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, మూల్యాంకనంలో పాల్గొంటున్న అసిస్టెంట్ ఎగ్జామినర్లు , స్పెషల్ అసిస్టెంట్లు, చీఫ్ ఎగ్జామినర్ల పనితీరును సమీక్షించారు. ప్రతి ప్రశ్నపత్రాన్ని నిర్దిష్ట మార్గదర్శకాలకు అనుగుణంగా ఖచ్చితంగా మూల్యాంకనం చేయాలని సూచించారు.

మూల్యాంకన కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులు, భద్రతా చర్యలు, రికార్డు నిర్వహణ తదితర అంశాలను పరిశీలించిన కలెక్టర్, ఎటువంటి లోపాలు లేకుండా వ్యవస్థాబద్ధంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పరీక్షల విశ్వసనీయతకు భంగం కలగకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా మూల్యాంకనం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖాధికారి యు. మాణిక్యం నాయుడు, విద్యాశాఖ అధికారులు, క్యాంప్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# 48వ వార్డులో బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





- మన ఊరు - మన జెండా పేరుతో జెండా ఆవిష్కరించిన గంకల
- 200మంది పేద ప్రజలకు బియ్యం పంపిణి చేసిన గంకల

**విశాఖ ఏప్రిల్ 6:(పెన్ పవర్)** జీవీఎంసీ 48వ వార్డులో 48వ వార్డు మాజీ కార్పొరేటర్, మాజీ జీవీఎంసీ బిజెపి ఫ్లోర్ లీడర్,మాజీ స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత అప్పారావు యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ముఖ్య నాయకులు,కార్యకర్తలతో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా గంకల మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక శత్రు దేశాలు దాడి చేసేందుకు కూడా వెనకడుగు వేశాయన్నారు.ప్రపంచంలో అతిపెద్ద శక్తివంతమైన రాజకీయ పార్టీ భారతీయ జనతా పార్టీ ఈ రోజు ఒక మహావృక్షంగా మారిందన్నారు.బీజేపీ అధికారంలోకి వచ్చాక కుల, మత ఘర్షణలు లేవని తెలిపారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' నినాదంతో బీజేపీ అడుగులు వేస్తోందన్నారు.దేశ నిర్మాణం లో సమస్యల పరిష్కారనికి భారతీయ జనతా పార్టీ అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు.బీజేపీ కార్యకర్తలు సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో పార్టీ ని అధికారంలోకి రావడానికి కృషి చేయాలన్నారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోందన్నారు.విశాఖ నార్త్ లో ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు సారధ్యంలో బిజెపి పార్టీ మరింత బలపడుతుందన్నారు. గడిచిన ఐదేళ్లలో బిజెపి పార్టీ తరపున పోటీ చేసి జీవీఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్ గా గెలిచి ప్రజల మన్ననలు పొందడం జరిగిందని,వార్డు అభివృద్ధి బిజెపి పార్టీతో సాధ్యమని నిరూపించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి డాన్సులు వేసి కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపారు. ఇదే ఉత్తేజంతో రానున్న జీవీఎంసీ కార్పొరేషన్ ఎన్నికలలో బిజెపికి అధిక సీట్లు గెలుపొందేలా కార్యకర్తలు, నాయకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం వార్డులో సుమారు 200 మంది పేద ప్రజలకు గంకల కవితా అప్పారావు యాదవ్ చేతుల మీదుగా బియ్యం పంపిణీ చేశారు. వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, ప్రజలకు ఏ సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని గంకల కవిత అప్పారావు యాదవ్ పిలుపునిచ్చారు.

## పిచ్చికుక్కల స్వైర విహారం.. ఆందోళనలో ప్రజలు..



**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 6 ..** చీపురుపల్లి మండలంలోని పేరిపి, రావివలస, ఇటకర్లపల్లి పంచాయతీల పరిధిలో గత వారం రోజులుగా పిచ్చి కుక్కలు స్వైర విహారం చేయడంతో పలువురు గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. సోమవారం నాడు పలు గ్రామస్తుల ఫిర్యాదుల మేరకు చీపురుపల్లి మండలం పేరుపి గ్రామానికి చెందిన గోలివెందల శ్రీను అనే వ్యక్తి మొహం పైన పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలు పాలయ్యారు. చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధమ చికిత్సలు అనంతరం ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విజయనగరం నుండి విశాఖపట్నం కేజీ హెచ్ కు వైద్య చికిత్స నిమిత్తం తరలించారు. అంతేకాకుండా అదే గ్రామానికి చెందిన గోలివెందల సత్యవతి, కరణం సత్తెమ్మ, చందక అప్పన్న అనే వృద్ధినితోపాటు తొత్తర జయశ్రీ అనే బాలిక పైన కూడా పిచ్చికుక్కల దాడి చేయడంతో తీవ్ర గాయాలు పాలై చికిత్సలు పొందుతున్నారు. అదేవిధంగా ఇటకర్లపల్లి గ్రామానికి చెందిన గొర్ల బుజ్జి అనే వ్యక్తి కూడా కుక్కల దాడిలో గాయపడ్డారు. గాయపడ్డ వారంతా చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధమ చికిత్సలు నిర్వహించుకొని డాక్టర్ల సలహాల మేరకు వైద్య సహాయం అందుకుంటున్నారు. ఇదిలా ఉండగా రావివలస పంచాయతీ పరిధిలోని కొత్తపేట గ్రామంలో కూడా పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తూ పశువులకు, దూడలకు, గాయపరచడంతో పలు పశువులు దూడలు మృత్యువాత పడి లక్షల ఐదు రూపాయలు నష్టపోయినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. కుక్కకాట్లకు గురైన రెండు రోజుల వ్యవధిలోనే పశువులు, దూడలు, మృతి చెందడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది అంటూ పలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి పిచ్చికుక్కల దాడి నుండి మనుషులతో పాటు పశు సంపదను కూడా పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించి మండలంలోని పెరిపి రావివలస పంచాయతీ కార్యదర్శులను వివరణ కోరగా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని వివరించారు.

## ఆసుపత్రి వసతులు పరిశీలించిన రాష్ట్ర బృందం..



**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 6 ..** చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సౌకర్యాలు వసతులు, వైద్య సేవల పైన నేషనల్ క్వాలిటీ ఇన్సూరెన్స్ స్టాండర్డ్ కమిటీ సోమవారం నాడు పరిశీలన జరిపింది. విశాఖపట్నం కి చెందిన జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్స్ డాక్టర్ ఆర్ భాస్కర్, కాకినాడ తాళ్లరేవుకు చెందిన నర్సింగ్ అధికారిని ఇవాంజెలిన్, జిల్లా క్వాలిటీ అధికారులు తులసి, శ్రీనివాస్ లు సోమవారం నాడు చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెంట్ సుధీర్ ఆధ్వర్యంలో స్థానిక వైద్యులతో సమావేశం ఏర్పాటు చేసి ఆసుపత్రిలో అమలు జరుగుతున్న వివిధ పథకాలు సౌకర్యాలు పట్ల ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అమలు జరుగుతున్న 108, జననీ సురక్ష యోజన , జననీ రక్షణ, తల్లి బిడ్డ వాహనాల పనితీరు , సాధారణ వైద్య సేవలు, అత్యవసర వైద్య సేవలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో అమలు జరుగుతున్న వివిధ విభాగాలను బృందం పరిశీలించింది. రాష్ట్ర బృంద పరిశీలన తర్వాత మెరుగైన ఫలితాలు సాధిస్తే కేంద్ర బృందం పరిశీలన జరిపి చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన అభివృద్ధి నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుందని ఈ సందర్భంగా బృందా పరిశీలికలు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహణ



**గాజువాక : పెన్ పవర్, ఏప్రిల్ 06:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని కేంద్రం ప్రకటించిన సందర్భంగా గాజువాక నియోజవర్గ తెలుగు మహిళ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ముగ్గుల పోటీని నిర్వహించారు .గాజువాక నియోజవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా పార్టీ కార్యాలయ ప్రారంభంలో నియోజకవర్గంలో తెలుగు మహిళా సోదరీలు ముగ్గుల పోటిలో

పాల్గొని అమరావతికి సంఘీభావంగా అద్భుతమైన ముగ్గులు వేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికైనా వైసీపీ నాయకులు జ్ఞానోదయం తెచ్చుకుని రాష్ట్ర రాజధాని అమరావతిని గౌరవించాలని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పిల్ల చేష్టలు చూసి దేశమంతా నవ్వుకుంటున్నారని విమర్శించారు. . మూడు రాజధానులతో వైసిపి పాడిన గ్రామాలను ప్రజలు వ్యతిరేకించారు కాబట్టే 11 స్థానాలకు పరిమితం చేసి ప్రతిపక్ష పాత్ర కూడా లేకుండా వైసిపి బుద్ధి చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి భవాని,జిల్లా తెలుగు మహిళా కార్యదర్శి సమ్మిడి ఉమా ,జనసేన 68 వార్డు ఇన్చార్జ మాకా శాలిని .జిల్లా పార్టీ కార్యదర్శి కణితి సన్యాసమ్మ .గాజువాక మహిళ కార్యదర్శి. గంధం యజ్ఞప్రియ. 69 మహిళా అధ్యక్షురాలు చందు . టిడిపి నాయకుడు ,వార్డ్ అధ్యక్షుడు కర్రి దసేంద్ర ,రట్టి వాసు వాణిజ్య విభాగ అధ్యక్షులు . ఎస్ మురళి మరి అధిక సంఖ్యలో మహిళా సోదర పాల్గొన్నారు.

## ఐదేళ్లపాటు పంచాయితీ సర్పంచ్ గా సుపరిపాలన అందించిన దంపతులకు సన్మానం.



**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 6.** అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ కొర్ర శాంతి కుమారి, రఘునాథ్ దంపతులకు గిరిజన రాష్ట్ర విభాగ కార్యదర్శి జల్లి సుధాకర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లపాటు లంబసింగి పంచాయతీ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందడంలో కీలక భూమిక పోషించారన్నారు. పంచాయతీ అభివృద్ధికి తమ వంతు సహకరించి తమదైన ముద్రను వేసుకున్నారు. అనంతరం సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ పంచాయతీ ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ప్రజలు నమ్మి తమకు అధికారిని కట్టబెట్టినందుకు వారి రుణాన్ని తీర్చుకున్నామన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనంతరం శాంతి కుమారి రఘునాథ్ దంపతులకు దుస్సాలుగా కప్పి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రావుల నాగమణి, రావుల నూకరాజు, విశాఖ కమిటీ ఉపాధ్యక్షులు సెక్రటరీ బలరాం, సరమండ నాగరాజు, మాజీ ఎంపీటీసీ దేపూరి గిరిబాబు, పార్టీ నాయకులు తిరుపతి, రమణ, చంటి, ధారబాబు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా పోలీసుల ప్రజా ఫిర్యాదుల వేదికలో 65 ఫిర్యాదుల స్వీకరణ





**త్వరిత పరిష్కారానికి అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు ఆదేశాలు**

**అనకాపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 06 :** స్థానిక అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో మొత్తం 65 ఫిర్యాదులను స్వీకరించినట్లు జిల్లా పోలీసులు వెల్లడించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, జిల్లా అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించినవి 28 ఉండగా, కుటుంబ కలహాలు 5, మోసపూరిత వ్యవహారాలు 2, ఇతర విభాగాలకు చెందినవి 30గా నమోదయ్యాయి.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని, 7 రోజుల్లోపు విచారణ పూర్తిచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చేపట్టిన చర్యలపై నివేదికలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలన్నారు. ప్రజలకు వేగవంతమైన న్యాయం లక్ష్యం ఫిర్యాదుదారులతో వ్యక్తిగతంగా మాట్లాడిన అదనపు ఎస్పీ, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పారదర్శకంగా, చట్టబద్ధంగా పరిష్కరించడంలో అనకాపల్లి జిల్లా పోలీసులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బి. శ్రీనివాసరావు సహా ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజముద్ర కలిగి ఉన్న పట్టాదారుల పాసుపుస్తకాల పంపిణీ.



**సోమేల సత్యవతి చేతుల మీదుగా అందుకున్న లబ్ధిదారులు**

**హుకుంపేట పెన్ పవర్ ఏప్రిల్ 4.** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం జి తాడేపుట్టు పంచాయతీలో పట్టా దారుని పాస్ పుస్తకల పంపిణీ జరిగింది ఈ కార్యక్రమంలో.స్థానిక సర్పంచ్ సోమేలి సత్యవతి సూకూరు సెగ్మెంట్ ఎంపీటీసీ కిలగాడ సింహాచలం హుకుంపేట మండల రెవెన్యూ తాసిల్దార్ శ్రీనివాస్ మరియు స్థానిక సర్పంచ్ సోమేలి సత్యవతి, చేతుల మీదుగా రైతులకు పట్టాలు అందించారు. ఈ పట్టాదారుల.పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన కార్యక్రమాల గురించి ఆమె క్లుప్తంగా వివరించారు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి నుండి ఇప్పుడున్న ల్యాండ్ టైటిల్ యాక్ట్ ని రద్దుచేసి రాజముద్రతో ఉన్న పట్టాదారుల పాస్ పుస్తకం పట్టాలను పంపిణీ చేస్తానని 2024 ఎలక్షన్ మేనిఫెస్టో లో చెప్పిన విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా చేస్తున్నారు అని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకాల లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసిల్దార్ పొట్టంగి మోహన్ రావు,

ఆర్ ఐ సీతమ్మ, విఆర్ఓ లక్ష్మి, సచివాలయం సర్వేయర్ పట్ట బోయిని రవిశంకర్, పీసా ఉపాధ్యక్లు ఆదేరి రాంబాబు, టీడీపీ నాయకులు సోమేలి లక్ష్మయ్య వార్డు సభ్యులు, సిదరి రాజారావు,మాజీ ఎంపీటీసీ వెన్నెలి దేవుళ్ళు మాజీ సర్పంచ్ తూబురు దేవన్ రాజు, రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## పేదలకు అండగా సీఎం సహాయ నిధి ఆసరా

**లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గణబాబు**





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 6 :** ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరంగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన నియోజకవర్గంలోని 89, 90, 91, 92వ వార్డుల్లో పర్యటించి లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి చెక్కులను అందజేశారు. అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 9 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.9,46,172 విలువైన చెక్కులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందించడమే కాకుండా, వారి మీద పడే ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేస్తోందని తెలిపారు. పేదల ఆరోగ్యం కాపాడడం ప్రభుత్వ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. వార్డుల వారీగా లబ్ధిదారుల వివరాలు 89వ వార్డు చుక్కా దేవి రూ.55,979లు, శిలపరశెట్టి దేవి రూ. 1,05,673లు, కుడిపూడి నాగేశ్వరరావు రూ. 21,695లు, కొరాడ వరలక్ష్మి రూ.2,52,582లు, 90వ వార్డులో పిల్లల రాము రూ.98,058లు,

పోతాల రూపరాణి రూ.19,341లు, చిలకలపల్లి శ్రీను రూ.1,40,000లు, 91వ వార్డులో బోణి సంధ్య రూ.30,300లు, 92వ వార్డులో పెదిరెడ్ల శేఖర్ రూ.2,22,544లు, ఈ కార్యక్రమంలో బొడ్డి విజయ్, దాడి రమేష్, ఎలమంచిలి ప్రసాద్, దాడి రమేష్ నాయుడు, అరుణ్ తదితరులు, ఆయా వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తమ కష్టకాలంలో ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించి సహాయం అందించడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం సహాయ నిధి తమకు ఎంతో ఉపశమనం కలిగించిందని తెలిపారు.

## గ్రీవెన్స్ సెల్ లో కమిషనర్ కి వినతుల వెల్లువ



**గాజువాక పెన్ పవర్, ఏప్రిల్ 06**

గ్రీవెన్స్ సెల్ లో అగనంపూడి జోనల్ ఆఫీస్ నందు జోనల్ కమిషనర్ మనీషా త్రిపాటి కి సమస్యల పరిష్కారానికి వివిధ పత్రం అందజేశారు.కమిషనర్ సానుకూలంగా స్పందించి ఈఈ కి జరగాల్సిన పనులకు అంచనా వ్యయం లెక్కించమని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు,మాజీ కార్పొరేటర్ దుల్లా రాము నాయుడు ,ఆలయ కమిటీ ప్రతినిధులు విందుల నారాయణరావు, విందుల సత్యనారాయణ, కొలిపాక అప్పారావు, కరణం సన్నీ, కండిపిల్లి పైడిరాజు,రామకోటి, దానబాల సన్యాసి రావు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పెందుర్తి లో'నీటి భద్రత'కు శ్రీకారం





- చెరువుల అభివృద్ధితో సాగునీటి బలోపేతం
- జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్

**విశాఖ, పెన్ పవర్, ఏప్రిల్ 06 :** సాగునీటి వనరుల పరిరక్షణ, ప్రతి ఎకరానికి నీటి అందుబాటు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "నీటి భద్రత--సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమానికి పెందుర్తి నియోజకవ ర్గంలో శ్రీకారం చుట్టారు. మండలంలోని సరిపల్లి గ్రామంలో సోమవారం ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సంప్రదాయ పూజలతో ప్రారం భించారు. ఈ సందర్భంగా సరిపల్లి పిన చెరువు ను పరిశీలించిన అధికారులు, సాగునీటి సంఘం సభ్యులు మరియు స్థానిక రైతులతో సమావేశమై పంటల సాగు పరిస్థితులు, నీటి అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు.

జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ, నీటి వనరుల పరిరక్షణతో పాటు భూగర్భ జలా ల పెంపునకు శాస్త్రీయ విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో సుమారు 125 చెరువుల్లో నీటి నిల్వలు మెరుగ్గా ఉన్నా యని, వర్షాకాలానికి ముందు కనీసం 6 మీటర్లు, అనంతరం 3 మీటర్లకు తగ్గకుండా నీటి మట్టా న్ని నిలుపుదల చేయడంపై చర్యలు తీసుకుం టున్నామన్నారు. చెరువుల వద్ద జంగిల్ క్లియ రెన్స్, బండ బలోపేతం, డీసిల్టింగ్ వంటి పనుల తో నిల్వ సామర్థ్యాన్ని పెంచుతామని వివరిం చారు. సరిపల్లి చెరువు వీఎంఆర్డీఏ పరిధిలో ఉన్నందున, భవిష్యత్తులో సుందరీకరణతో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటుపై కూడా యోచి స్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని గ్రామస్థులను సూచనలు అందించాలని కోరారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జలవనరుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మొదటి ఐదు రోజులు సర్వే నిర్వహించి, తదుపరి 80 రోజుల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకు న్నట్లు వెల్లడించారు. పెందుర్తి నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటా యించాలని కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే, సరిపల్లి గ్రామ రైతులు రైల్వే ట్రాక్ అవతల ఉన్న 250 ఎకరాల సాగుభూములకు రాకపోకల్లో ఇబ్బం దులు ఎదుర్కొంటున్న సమస్యను ప్రస్తావించా రు. దీనికి శాశ్వత పరిష్కారంగా అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎంపీతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సాగునీటి సంఘాల సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పనులు 70 శాతం పూర్తి





**మూలాపేట పోర్టును పరిశీలించిన మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి**

**ఈ యేడాది చివరి నాటికి పోర్టు ఆపరేషన్ పనులు ప్రారంభమే లక్ష్యం.. మంత్రులు సంయుక్తంగా ప్రకటన**

**సంతబొమ్మాలి, పెన్ పవర్ ఏప్రిల్ 6 :** గత ప్రభుత్వ హయాంలో మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పనులు కేవలం 20 శాతం మాత్రమే జరగగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 70 శాతం వరకు పనులు పూర్తి చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సంతబొమ్మాలి మండలం మూలపేట లో నిర్మాణం జరుగుతున్న పోర్టు పనులను రాష్ట్ర రహదారులు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో కలిసి మంత్రి అచ్చన్న సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చన్న మాట్లాడుతూ పోర్ట్ కు రవాణా సదుపాయం ముఖ్యమని, అందుకు సంబంధించి ఉప్పు భూములు అవసరమని, ఉప్పు భూములు కోసం కేంద్ర ప్రభుత్వానికి గత ప్రభుత్వం ఒక్క లేఖ కూడా పంపలేదన్నారు. పోర్టుకు ఉప్పు భూములు 400 ఎకరాలు అవసరమైతే 399 ఎకరాలు భూములు 99 సంవత్సరాలకు లీజుకు ఇచ్చినట్లు వెల్లడించారు. అక్కడ అటవీ శాఖ భూములు ఉన్నాయని, వాటిని తీసుకొని అటవీ శాఖ కు కాంపన్సేషన్ వేరే ప్రాంతంలో ఇస్తామన్నారు. రోడ్డు, రైల్వే పనులు జరగక పోర్ట్ ప్రారంభం జరగలేదని, ఆ పనులు త్వరితగతిన చేపడుతున్నట్లు చెప్పారు. ట్రయల్ కు మరో షిప్ తీసుకు వస్తామని, అనంతరం ఈ యేడాదే మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ ప్రారంభిస్తామన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో అంగన్వాడీ కేంద్రాలు, తాగునీరు, దేవదాయం, తదితర మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మూలపేట పోర్టు నిర్వాసితులకు ఏర్పాటు చేయనున్న ఆర్ అండ్ ఆర్ కాలనీ రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చి దిద్దుతామన్నారు. ఈ ప్రాంతానికి పోర్టుతో అనుబంధమయ్యే పరిశ్రమలు రావాలన్నారు. పరిశ్రమలు వస్తే తప్ప ఉపాధి ఉండదన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సానుకూల వాతావరణం ఉండాలన్నారు.

మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ పనులు ఇప్పటి వరకు 70 శాతం పనులు జరిగినట్లు రాష్ట్ర రహదారులు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుతెన్నులను ప్రత్యేకంగా పరిశీలించారు. పరిశీలన అనంతరం పోర్టు పనుల పురోగతిపై అధికారులతోను, పోర్టు యాజమాన్యంతో సమీక్షించారు. పోర్టు పురోగతి పనులను మరింత వేగవంతం చేయాలని మంత్రులు ఆదేశించారు. ఈ ఏడాది చివరి నాటికి పోర్టు పనులను పూర్తి చేసి ఆపరేషన్లు ప్రారంభించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సంయుక్తంగా ప్రకటించారు.

ఈ సందర్భంగా మంత్రి బిసి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ నిర్మాణంతో శ్రీకాకుళం జిల్లా ప్రజల చిరకాల వాంఛ తీరనుందన్నారు. పోర్టు నిర్మాణంలో పెండింగ్ సమస్యలు, ఇతర సమస్యలు పైన చర్చించారు. ఎప్పటిలోగా పనులు పూర్తవుతాయనే అంశంపైనా చర్చించారు. దాదాపు రూ.4361.91 కోట్లతో చేపట్టిన మూలాపేట పోర్టు పనుల్లో.. ఫేజ్ 1 లో 1524 ఎకరాల్లో 4 బెర్త్ ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు.

2025 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ భూ సేకరణ వంటి అనివార్య కారణాలతో 2026 నవంబర్ నాటికి పోర్టును ప్రారంభించాలన్న దృఢ నిశ్చయంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. మూలాపేట పోర్టు ఉత్తరాంధ్రలో వ్యూహాత్మకంగా కీలక స్థానంలో ఉందన్నారు. ఈ పోర్టు నిర్మాణంతో ఆంధ్రప్రదేశ్ తో పాటు తీర ప్రాంతం లేని, సరిహద్దు రాష్ట్రాలైన చత్తీస్ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్..దక్షిణ ఒడిస్సా ప్రాంతాలకు ఇది అత్యంత అందుబాటులో ఉండే పోర్టు కావడం కలిసొచ్చే అంశమన్నారు. మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు కు సంబంధించి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత తమపై ఉందని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ప్రతి మూడు నెలలకు ఒకసారి పోర్టుల పురోగతిపై సమీక్ష చేస్తున్నట్లు వెల్లడించారు.

2024 జూన్ నాటికి పోర్టు భౌతిక పురోగతి.. మొత్తం 25.02 % గా ఉండగా.. ప్రస్తుతం 74.65 % పనులు శరవేగంగా పూర్తి చేశామని చెప్పారు. గత 20 నెలల్లో దాదాపు 49.63 % పనులు పూర్తి చేసినట్లు వివరించారు. బ్రేక్‌వాటర్ పనులు జూన్ 2024 నాటికి 28.9% పూర్తయితే గత 20 నెలల్లో 63.48 % శాతం పూర్తి చేశాం.. మొత్తంగా 92.38 % శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. డ్రెడ్జింగ్ ఢ రిక్లమేషన్ పనులులి జూన్ 2024 నాటికి 37.8% పూర్తయ్యితే గత 20 నెలల పాలనలో 51.91 % పనులు పూర్తి చేశామన్నారు.. మొత్తంగా ఇప్పటి వరకు 89.71 % పనులు పూర్తయ్యాయి..బెర్త్ లకు సంబంధించి జూన్ 2024 నాటికి 26.3% శాతం పనులు పూర్తయితే, గత 20 నెలల్లో 51.53 % పనులు పూర్తి చేశాం.. మొత్తంగా 77.83 % పనులు పూర్తయ్యాయన్నారు..ఆన్‌షోర్ మౌలిక వసతులులి గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమే కాలేదు.. గత 20 నెలల్లో దాదాపు 13.65 % పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఆర్థిక పురోగతిలి 2019--24లో రూ.718.50 కోట్లు గత ప్రభుత్వం ఖర్చు చేస్తే.. ప్రస్తుతం రూ.1835.98 కోట్ల మేర పనులు చేపట్టడం జరిగిందన్నారు. మొత్తంగా గత 20 నెలల పాలనలో రూ.1117.48 కోట్లు వెచ్చించడం జరిగిందన్నారు.

గత ప్రభుత్వంలో మూలాపేట, విష్ణుచక్రం గ్రామాల్లో పునరావాసం (=ఢ=) కోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదని, గత 20 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో విష్ణుచక్రం గ్రామంలో పూర్తిగా పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. అలాగే మూలపేట గ్రామంలో పునరావాస పనులు ఇప్పటికే పురోగతిలో ఉన్నట్లు వివరించారు. పునరావాసానికి సంబంధించి తాగునీరు కోసం పైప్ లైన్లు, స్వచ్ఛభారత్ కింద టాయిలెట్లు నిర్మాణం, ట్రాన్స్కో, రైల్వే లైన్ వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. నౌపాడ జంక్షన్లో ఫ్లైఓవర్ ఏర్పాటుకు అధికారులతో చర్చించినట్లు పేర్కొన్నారు. మూలాపేట పోర్టును అధికారులు ప్రతినిత్యం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. జూలై, ఆగస్టు నెలలో ప్రధాన మంత్రి ఆధ్వర్యంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మారిటైం బోర్డు నుండి సిఈఓ అభిషేక్ కుమార్, చీఫ్ ఇంజనీర్ రాఘవరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునిరెడ్డి, ఆర్డీఓ కృష్ణమూర్తి, టాటా కన్సల్టింగ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ నుండి ఎ. అనీల్ కుమార్, జి. అనీల్ కుమార్, పి. వివేకనంద, ఎస్బీ కిరణ్ కుమార్, దొరబాబు, పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వినతులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

- అధికారులకు కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ కఠిన సూచనలు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 06 :** ప్రజల సమస్యల పరిష్కారంలో ఆలస్యం చోటుచేసుకోకుండా వేగంగా చర్యలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికా రులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా అందిన వినతు లపై ప్రత్యేక దృష్టి పెట్టి, నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించా రు. ఈ సందర్భంగా డీఆర్వో ఎం. విశ్వేశ్వరనా యుడు, ఏడీసీ సత్యవేణి పాల్గొన్నారు. అధికా రులు పిటిషనర్లతో నేరుగా మాట్లాడి సమస్యల మూలాలను గుర్తించాలని, పదేపదే వస్తున్న ఫిర్యాదులపై లోతైన పరిశీలన చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోపే సమస్యల ను పరిష్కరించడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్ర మంలో మొత్తం 334 వినతులు నమోదయ్యా యి. ఇందులో రెవెన్యూ శాఖకు



చెందినవి 59, జీవీఎంసీకి సంబంధించినవి 83, పోలీస్ శాఖకు చెందినవి 23 కాగా, ఇతర శాఖలకు సంబంధిం చినవి 169 వినతులు ఉన్నాయి.



అదేవిధంగా రెవెన్యూ క్లినిక్‌లో ఆర్డీవోలు, తహశీ ల్దార్లు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాస్థాయి అధికారులు అన్ని శాఖల నుంచి హాజరై ప్రజల సమస్యలను వినిపించి, పరిష్కా రానికి చర్యలు ప్రారంభించారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

జూనియర్ సివిల్ జడ్జి ఎం. రోషిణి



**కోటబొమ్మాళి, పెన్ పవర్ ఏప్రిల్ 6 :** కోటబొమ్మాలి జూనియర్ సివిల్ కోర్టులో మే 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఎం. రోషిణి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాజీకి అనుకూలమైన కేసులు పరిష్కరించుకోవాలని, రాజీయే రాజమార్గం అని అన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించబడునని తెలిపారు. రాజీకి వీలైనన్ని ఎక్కువ కేసులును జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవాలని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని ఆమె తెలిపారు. అలాగే లోక్ అదాలత్ లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్ట ఫీజు కూడా వాపసు ఇవ్వబడునని అన్నారు.

# 50 వేల మందితో శబల భోజనాలు విజయవంతం

- పోలీసుల సేవలు అద్వితీయం
- శబల భోజనాలకు సహకరించిన వారికి అభినందనలు
- ఆకుల చలపతిరావు, సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు




**విశాఖ ఏప్రిల్ 6:(పెన్ పవర్)**50 వేల మందితో శబల భోజనాలు విజయవంతం అయ్యింది అని సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు అన్నారు. సోమవారం ఉదయం సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాల వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. సేవ్ సంస్థ విజయరామ్, సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు, తులసి నేచురల్స్ సత్యనారాయణ ల నేతృత్వంలో అయిదు రోజుల పాటు నిర్వహించిన శబల భోజనాల పండుగ కు పోలీసుల కమిషనర్ శంకరబ్రత బాక్షీ నేతృత్వంలో పోలీసుల అందించిన సేవలు అద్వితీయం అన్నారు. అలాగే శబల భోజనాలకు సహకరించిన వారికి, చేయూత అందించిన వారికి, పాల్గొన్న వారికి, విశిష్ట అతిథులుగా విచ్చేసిన వారందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్, ఫ్లెక్సీలు లేకుండా నిర్వహించడానికి సహకారం అందించిన వారికీ అభినందనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, మేంగొమేన్ అప్పాజీ, ప్రకృతి ఆధారంగా పంటలు పండించే శ్రీనాథ్, కుమార్, ఉత్తర ఆంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు వర్మ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.

## పొలంలో విషసర్పం కలకలం.. రైతుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 6**:అల్లూరి సీతారామరాజు జీకే వీధి మండలంలోని ఎ. దారకొండ పంచాయతీ పరిధిలోని ఎ.దారకొండ గ్రామంలో ఆదివారం భారీ విషసర్పం కలకలం రేపింది. సుమారు 15 అడుగుల పొడవు గల పాము రైతుల కంటపడటంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. ఆదివారం సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో రైతులు టమాట పంట పొలాలకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సందర్భంగా విషసర్పం ఒక్కసారిగా దాడి చేయడానికి ప్రయత్నించగా, రైతు చాకచక్యంగా తప్పించుకుని ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అనంతరం అక్కడున్న రైతులు కలిసి పామును హతమార్చారు. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. పొలాల్లో పనిచేసే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సాయంత్రం వేళల్లో జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు రైతులు సూచించారు.


## పాస్టర్ తిమోతి దంపతులకు ఘన సన్మానం





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 6:**ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక జాతీయ సలహా మండలిలో జాతీయ సలహాదారుగా ఎంపికైన రెవ.వి. తిమోతికి చాపరాతిపాలెం మరియు సిరిబాల గ్రామాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, సంఘ నాయకులు కలిసి ఆయనను బొకేలు అందజేసి శాలువాలతో సత్కరించారు. పాస్టర్ తిమోతి, పాస్టర్ అమ్మ కుమారికి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో రెవ.వి.తిమోతి మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో క్రైస్తవులు మరియు దైవజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జుంబు చినబెన్నస్వామి, మాజీ సర్పంచ్ బాలరాజు, వసుపరి చిన్నబ్బాయి, వి. రమణబాబు, బి. వెంకటరావు,జె.లక్ష్మణరావు సిరిబాలలో పాస్టర్ యోధ,ముర్ల సత్యనారాయణ, జయలక్ష్మి, ఎంపీటీసీ జోరంగి సరస్వతి, వైస్ ప్రెసిడెంట్ చల్లంగి శ్రీధర్, కోటిబాబు, బి. సత్యనారాయణ, తుచ్చా బంగారయ్య, సిహెచ్ సుహాసిని, సిహెచ్ సుదర్శన్, బి. బంగారు రాజు, బూడిద రామారావు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి నియోజకవర్గ పునరుద్ధరణకు వినతి



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 6:**అల్లూరి జిల్లాలో ఒకప్పటి చింతపల్లి శాసనసభ నియోజకవర్గాన్ని మళ్లీ పునరుద్ధరించాలన్న డిమాండ్ క్రమంగా బలపడుతోంది. గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలు తీర్మానాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జీకేవీధిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండలానికి చెందిన పాత్రికేయుల బృందం అధికారులకు వినతిపత్రం సమర్పించింది. చింతపల్లి నియోజకవర్గం ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఎంపీడీవో బిహెచ్వి రమణబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి విలేకరుల సంఘం అధ్యక్షులు సాయం రమణతో పాటు పాత్రికేయులు సురకత్తి లక్ష్మణ్ బాబు, మాదిరి చంటిబాబు, సాగిన లక్ష్మణరావు, సాగిన శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నీటి భద్రతే భవిష్యత్ తరాలకు భరోసా.





నీటి భద్రతతోనే – మనకు భవిష్యత్

**హుకుంపేట పెన్ పవర్ ఏప్రిల్ 4** :అల్లూరి సీతారామ జిల్లా హుకుంపేట మండలం అడ్డుమండ గ్రామంలో నీటి భద్రత -- సాగునీటి సంఘాల బాధ్యత అనే అంశంపై సోమవారం అడ్డుమండ పంచాయతీ సన్యాసంపాలెం గ్రామంలో మరియు కొట్నాపల్లి పంచాయతీ పెద్దగరువు గ్రామంలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇరిగేషన్ శాఖ ఎస్ఎంఐ డివిజన్ ఆధ్వర్యంలో చేపట్టారు.
సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఎంఐ డీఈ ఎం. రాజేంద్ర కుమార్, విశాఖపట్నం ఎస్ఎంఐ ప్రతినిధి ఎం. రామంజి, హుకుంపేట మండల వ్యవసాయ అధికారి సుధాకర్, టిడిపి మండల అధ్యక్షుడు శతక బొంజు బాబు, నీటి సంఘాల అధ్యక్షులు కైలాస్ రావు, కిల్లో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, నీటి వనరుల పరిరక్షణలో సాగునీటి సంఘాల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. రైతులు నీటిని అవసరానికి అనుగుణంగా మాత్రమే వినియోగించాలని, వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువులు, కాలువలు మరియు చెక్‌డ్యామ్‌ల సంరక్షణకు గ్రామస్థులు కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.
చెక్‌డ్యామ్‌లు మరియు సాగునీటి వనరులు సక్రమంగా నిర్వహించబడితే భూగర్భ జలాలు పెరుగుతాయని, దీని ద్వారా రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు.
ఈ సమావేశం ద్వారా రైతులకు నీటి పొదుపు, నిర్వహణ పద్ధతులపై స్పష్టమైన అవగాహన కలిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బొడ్డ శ్యాంమ్, బాకురు సర్పంచ్ వెంకటరమణ. టిడిపి నాయకులు పాడి బాలన్న, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు పి శంకర్, నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సృష్టి క్షేత్రానికి అడ్డంకులు సృష్టిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసారో తెలుసుకోండి....





- **అమరావతి రాజధాని కి కట్టుబడి ఉన్నారా లేక మావిగన్ కి కట్టుబడి ఉన్నారో ప్రజలకు చెప్పాలి....**
- **తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ......**
- **గణేష్ సొంత ఊరు చెరువులో నిర్మాణం చేస్తే రైతులకు ఇబ్బంది లేనప్పుడు నర్సీపట్నంలో ఎలా వస్తుందో గణేష్ సమాధానం చెప్పాలి....**
- **మండల టిడిపి పార్టీ మహిళ అధ్యక్షురాలు ఇనపసప్పల సత్యవతి.....**

**నాతవరం,పెన్ పవర్ (ఏప్రిల్ 06):** సృష్టి క్షేత్రానికి అడ్డంకులు సృష్టిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో తెలుసుకోవాలని తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరెక్ట్ సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన నాతవరంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో శ్రీ శక్తి పంచాయతన ఆలయంలో గల శివలింగానికి మండల కూటమి నాయకులు సృష్టి క్షేత్ర నిర్మాణానికి ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఉండాలని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గణేష్ గత ఐదు సంవత్సరాలలో ఏం చేశారో ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోవాలన్నారు. గుమ్మడి కొండలో నల్లగొండమ్మ తల్లి దేవాలయ నిర్మాణం నీరు ప్రవహించే ఏరులో నీవు కొబ్బరికాయ కొట్టినప్పుడు గుర్తుకు రాలేదా అని ఎద్దేవా చేశారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులని విశాఖపట్నాన్ని రాజధాని చేస్తామన్నారు. ఇప్పుడు అమరావతికి వ్యతిరేకమా లేక మావీగన్ కు అనుకూలమా మీరే ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. మండల టిడిపి పార్టీ మహిళా అధ్యక్షురాలు,డి.ఎర్రవరం సర్పంచ్ ఇనప సప్పుల సత్యవతి మాట్లాడుతూ గణేష్ సొంత గ్రామమైన బాలరాజు కొత్తపల్లిలో శివపార్వతుల విగ్రహం చెరువులో నిర్మాణం చేశారు. సర్వే నంబర్ 197 విస్తీర్ణం మూడు ఎకరాలు మరి ఆ ప్రాంత రైతులకు నీరు ఎలా వెళ్తుందని నిర్మాణం చేశారో చెప్పాలన్నారు. అక్కడ లేని అడ్డంకి నర్సీపట్నంలో ఎలా వస్తుందని, నర్సీపట్నం అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలా చేస్తున్నారు తప్ప రైతులకు ఎటువంటి ఇబ్బంది లేదనే విషయం ప్రజలందరికీ తెలుసునని అన్నారు. ఇకనైనా మంచి పనులకు సహకరించండి లేదంటే ఊరుకోండి అంతేగాని నర్సీపట్నం అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే నర్సీపట్నం ప్రజలు చూస్తూ ఊరుకోరని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం జెడ్పీటీసీ సుకల రమణమ్మ,పిఏసియస్ అధ్యక్షులు బొళ్ళం రాంప్రసాద్, తాండవ ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ మేడపరెడ్డి జోగు బాబు, పిఏసిఎస్ అధ్యక్షులు అపిరెడ్డి మాణిక్యం,సింగంపల్లి సన్యాసి దేముడు, మండల తెలుగు యువత అధ్యక్షులు పోలుపర్తి సాయి, మాజీ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ కూండ్రపు అప్పలనాయుడు,గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షులు పైల సూరిబాబు, మండల సోషల్ మీడియా కన్వీనర్ శెట్టి గోపి, పారుపల్లి దాసు,బిజెపి మండల పార్టీ అధ్యక్షులు సబ్బి కుమార్ స్వామి,శ్రీరంగస్వామి, శెట్టి లోవ, చింతకాయల శ్రీను,సీనియర్ నాయకులు, కార్యకర్తలు,యువత,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సెంట్రల్ పార్క్ నైట్ ఫుడ్ కోర్ట్ పునరుద్ధరణకు డిమాండ్



**కలెక్టర్, జివిఎంసీ కమిషనర్‌కు వినతి**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 06 :** సెంట్రల్ పార్క్ వద్ద తొలగించిన నైట్ ఫుడ్ కోర్టును తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ వీధి విక్రయదారులు జిల్లా కలెక్టర్‌కు, జివిఎంసీ కమిషనర్‌కు పీజీఆర్ఎస్ వేదికగా వినతిపత్రా లు సమర్పించారు. గత 13 రోజులుగా గాంధీ బొమ్మ వద్ద రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్న ప్పటికీ అధికారుల నుంచి స్పందన లేకపోవడం తో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.
వీధి విక్రయదారులు మాట్లాడుతూ, గత ఏడాది సెప్టెంబర్ 19న ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఉదయం సమయంలో నైట్ ఫుడ్ కోర్టును తొలగించారని ఆరోపించారు. అప్పట్లో జోన్-4 కమిషనర్ 10 రోజుల్లో తిరిగి ఏర్పాటు చేస్తామని లిఖితపూర్వక హామీ ఇచ్చినా, దాదా పు ఏడు నెలలు గడిచినా ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు.
వీధి విక్రయదారుల చట్టం-2014 ప్రకారం వెం డింగ్ కార్డులు జారీ చేసి 2016లో నైట్ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారని, అదే చట్టాన్ని ఉల్లం ఘిస్తూ ముందస్తు నోటీసు ఇవ్వకుండా, ప్రత్యా మ్నాయ స్థలం చూపించకుండా తొలగించడం అన్యాయమని అన్నారు. ఈ ఫుడ్ కోర్ట్‌పై ఆధా రపడి సుమారు 120 కుటుంబాలు జీవనం సాగి స్తున్నాయని, ప్రస్తుతం ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు.
ఫుడ్ కోర్ట్ లేకపోవడంతో పిల్లల చదువులు ఆగిపోయాయని, ఇళ్ల అద్దెలు, రుణాలు చెల్లిం చలేని పరిస్థితి ఏర్పడిందని బాధ వ్యక్తం చేశా రు. ముద్ర, పీఎంస్వానిధి వంటి పథకాల కింద తీసుకున్న రుణాలు కూడా చెల్లించలేకపోతు న్నామని తెలిపారు.
ఈ సందర్భంగా విశాఖ తోపుడు బండ్ల చిల్లర వర్తక కార్మిక సంఘం (సిఐటియు) నాయకులు ఏ. సింహాచలం, పి. వెంకట్రావు, ఎం. సుబ్బా రావు, కే. శ్రీకాంత్, దుంగ శ్రీను మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వీధి విక్రయ దారుల సమస్యలను విస్మరించడం సరైంది కాదన్నారు.నైట్ ఫుడ్ కోర్ట్ లేకపోవడం వల్ల మరణించిన ముగ్గురు కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని, స్మార్ట్ ఫుడ్ కోర్ట్ ఏర్పా టయ్యే వరకు తాత్కాలికంగా పాత ప్రదేశంలోనే వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.దవారంలోగా ఫుడ్ కోర్ట్ పునరుద్ధరణ జరగకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

## సాగునీటి భద్రతపై అవగాహన కార్యక్రమం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఏప్రిల్ 6:**సాగునీటి భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళికపై రైతులు, సంబంధిత వర్గాలు అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ బోయిన కుమారి సూచించారు. సోమవారం జీకేవీధిలో ఎంపీడీవో రమణబాబు, ఇరిగేషన్ ఏఈఈ నాగరాణి కలిసి సాగునీటి సంఘాల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగునీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. జలశక్తి, ఉపాధి హామీ పథకాల ద్వారా కాలువలు, చెరువులు వంటి సాగునీటి వనరులను మరమ్మతులు చేసి అభివృద్ధి చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు పాల్గొని పథకాల అమలు, ప్రయోజనాలపై చర్చించారు.

## చామగెడ్డలో ఘనంగా 'మన ఊరు--మన జెండా' కార్యక్రమం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 6,**బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజన గ్రామాల్లో 'మన ఊరు--మన జెండా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జీకేవీధి మండలం వంచుల పంచాయతీ చామగెడ్డ గ్రామంలో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి చల్లంగి అచ్యుత్ నాయకత్వం వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని అన్నారు. గ్రామ స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు రాజకీయంగా ఎదగడానికి భారతీయ జనతా పార్టీ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. గిరిజనుల సంక్షేమం, మారుమూల గ్రామాల అభివృద్ధికి బీజేపీ ప్రాధాన్యత ఇస్తోందని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పంచాయతీ, బూత్ స్థాయి నాయకులు గ్రామాల వారీగా పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మావిగన్ మోడల్‌పై రాజకీయ రగడ



**ఏబీఎన్, రాధాకృష్ణపై కన్నబాబు తీవ్ర విమర్శలు**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 06 :** రాష్ట్ర రాజకీయాల్లో మావిగన్ అభివృద్ధి మోడ ల్‌పై చర్చ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థలు, వారి అధినేత రాధాకృష్ణ పై మాజీ మంత్రి కురసాల కన్నబాబు తీవ్ర స్థా యిలో విమర్శలు గుప్పించారు. మావిగన్ ప్రతి పాదనకు ప్రజల్లో వస్తున్న స్పందనను తట్టుకోలే క దుష్ప్రచారానికి దిగుతున్నారని ఆయన ఆరో పించారు.విశాఖపట్నంలోని వైఎస్సార్‌సీపీ సిటీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమా వేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబుతో కలిసి కన్నబాబు మాట్లాడారు. మచిలీపట్నం, విజయవాడ,గుంటూరు ప్రాంతాలను కలిపిన మావిగన్ అభివృద్ధి కారిడార్ రాష్ట్రానికి గ్రోత్ ఇంజిన్‌గా మారుతుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్టు తెలిపారు.మావిగన్ మోడల్‌పై చర్చ ప్రారంభమై న వెంటనే అధికార పార్టీ నాయకులు డైవర్షన్ రాజకీయాలకు దిగారని కన్నబాబు విమర్శించా రు. అమరావతి నిర్మాణం పేరుతో భారీ ఖర్చు లు, దీర్ఘకాల ప్రణాళికలతో పోలిస్తే మావిగన్ మోడల్ తక్కువ వ్యయంతో వేగంగా అమలు చేయగలమని పేర్కొన్నారు. అమరావతి అభి వృద్ధికి లక్షల కోట్లు అవసరమవుతాయని చెప్పి న నాయకులు, ఇప్పుడు మావిగన్‌పై విమర్శలు చేయడం విరుద్ధంగా ఉందన్నారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థలు రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని, వ్యక్తిగత దూషణలతో రాజకీయాలను దిగజారుస్తున్నా యని ఆయన మండిపడ్డారు. మావిగన్‌పై చర్చ ను పక్కదారి పట్టించేందుకు వ్యక్తిత్వ హననా నికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ మాట్లాడుతూ, మావిగన్ మోడల్‌లో ఇప్ప టికే పోర్టు, ఎయిర్‌పోర్టు, జాతీయ రహదారులు వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయని, అమరావతిలో ఇవన్నీ కొత్తగా నిర్మించాల్సి వస్తుందని తెలిపారు. అమరావతి చట్టబద్ధత పేరిట జరుగుతున్నది అభివృద్ధి కాదని, అవి నీతికి అవకాశమని విమర్శించారు.

విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీని వాసరావు మాట్లాడుతూ, మావిగన్ ప్రతిపాదన తో అధికార పార్టీలో ఆందోళన మొదలైందన్నా రు. ఇన్నాళ్లూ ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృ ద్ధిపై మాట్లాడని వారు ఇప్పుడు కారిడార్‌ల పేరుతో కొత్త చర్చలు ప్రారంభించారని వ్యా ఖ్యానించారు.ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ, అమరావతి నిర్మాణం పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలపై భారీ ఆర్థిక భారం మోపే ప్రణాళికలకు బదులుగా సమాన అభి వృద్ధి లక్ష్యంగా మావిగన్ మోడల్‌ను పరిశీలిం చాలని సూచించారు.

ఈ సమావేశంలో మాజీ మంత్రులు పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంక టరామయ్య, పార్టీ నేతలు బాణాల శ్రీనివాసరా వు, పేడాడ రమణకుమారి, శేషికళ తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తక్కువ స్పందన



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 6**:గూడెం కొత్తవీధి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గత నాలుగు వారాలుగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుండి తగినంత స్పందన లభించలేదని అధికారులు తెలిపారు. సోమవారం నిర్వహించిన వేదికలో కూడా కేవలం మూడు వినతులు మాత్రమే అందినట్లు ఎంపీడీవో రమణబాబు తెలిపారు.అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆశించిన స్థాయిలో వినతులు రాకపోవడం గమనార్హమని ఆయన పేర్కొన్నారు. రమణబాబు మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలు ఈ వేదిక ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రజలు వారి సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఇలాంటి వేదికలు కీలకంగా ఉంటాయని అధికారులు గుర్తుచేశారు.

## బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్బంగా జెండా ఆవిష్కరణ, సేవా కార్యక్రమాలు



**ములగాడ, పెన్ పవర్, ఏప్రిల్ 06 :** బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని గాజువాక డిపో సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఘనంగా నిర్వహించారు. సోమవారం ములగా డ మండల బీజేపీ అధ్యక్షుడు లక్కరాజు రామ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కనీస వేతనాల డైరెక్టర్ పొలిమేర శ్రీని వాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భం గా రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సిహెచ్ రామ్మోహన్ నాయుడుతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మా ట్లాడిన పొలిమేర శ్రీనివాసరావు, దేశంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో అమలవుతున్న "సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్" సిద్ధాంతా లను సాకారం చేసేందుకు బీజేపీ కృషి చేస్తోంద న్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షే మ పథకాలను ప్రజలు సద్విని యోగం చేసుకో వాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్త సుబ్రహ్మణ్యం, జ్ఞానేశ్వర్, వార్డు మహి ళా నాయకురాలు పొలిమేర దేవామణి, బీజేపీ సీనియర్ నాయకులు మళ్ళా రవి, సురేష్, దేవ ర్ నర్సింగరావు, సూరిశెట్టి రవి, వేమల ముత్యా ల నాయుడు, మద్దాల రాజు, ప్రసాద్ కృష్ణతో పాటు పార్టీ కార్యకర్తలు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చెరువులు పునరుద్ధరణతోనే భూగర్భ జలాల పెంపు సాధ్యం



- నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమం ఘనంగా ప్రారంభం
- రైతులకు దీర్ఘకాలిక సాగునీటి భద్రత లభిస్తుంది.
- టిడిపి నేత కిమిడి నాగార్జున

**గంట్యాడ పెన్ పవర్ 06-04-2026 :** చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాల స్థాయిని గణనీయంగా పెంచవచ్చుని, దీని వల్ల రైతులకు స్థిరమైన సాగునీటి వనరులు అందుబాటులోకి వస్తాయని విజయనగరం జిల్లా డీసీసీబీ చైర్మన్, టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున పేర్కొన్నారు.

సోమవారం గజపతి నగరం నియోజకవర్గంలోని గంట్యాడ మండలం నరవ గ్రామంలో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన "నీటి భద్రత – సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వనరుల సంరక్షణ అత్యంత అవసరమని, చెరువులు, కాలువలు పునరుద్ధరించడం ద్వారా వర్షపు నీటిని నిల్వచేసి భూగర్భ జలాలను పెంపొందించవచ్చుని తెలిపారు. రైతులు, సాగునీటి సంఘాలు కలిసి పనిచేస్తే మాత్రమే నీటి సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అలాగే, ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం గ్రామీణాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని, ప్రతి గ్రామంలో నీటి నిర్వహణపై అవగాహన పెరగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో గంట్యాడ మండల టిడిపి అధ్యక్షులు కొండపల్లి భాస్కర నాయుడు, సుంకర సాయి కృష్ణ, తాటిపూడి నీటి సంఘం అధ్యక్షులు జగన్నాధం, నీటి పారుదల శాఖ అధికారులు రామునాయుడు, శంకరరావు, శ్యామ్, విజయ్ కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## సాగు నీటి రంగంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ....





- భూగర్భ జలాలు పెంచాలి...
- తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ....
- నీటి భద్రత- సాగునీటి సంఘాలదే బాధ్యత....
- తాండవ ప్రాజెక్ట్ ఈఈ బాల సూర్యం....

**నాతవరం,పెన్ పవర్ (ఏప్రిల్ 06):** సాగునీటి రంగంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని,అందులో భాగంగానే వంద రోజులు కార్యక్రమంలో భాగంగా తలుపులు మరమ్మత్తులు,పొర్లు కొట్టు మరమ్మత్తులు తదితర పనులు చేపడుతున్నామని తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన నాతవరంలో గల ఇరిగేషన్ కార్యాలయంలో నర్సీపట్నం,నాతవరం,కోటనందూరు, రౌతులపూడి మండలాలకు చెందిన సాగిన సంఘాల అధ్యక్షులు,సభ్యులతో నీటి భద్రత–సాగినీటి సంఘాల బాధ్యత అనే అంశంపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ లోపు నీటి సంఘం అధ్యక్షులు తమ పరిధిలో చెరువుల్లో ఎక్కడ చెక్ డాములు దెబ్బతిన్నాయి, అలాగే గొలుసు కొట్టు చెరువుల త్రవ్వకాలు ఎక్కడ అవసరం తదితర విషయాలను స్వయంగా పరిశీలించి అధికారులకు నివేదిక అందజేస్తే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. భూగర్భ జలాలు పెంచడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని నాలుగు టీఎంసీల నీటిని తాండవ ప్రాజెక్టు క్రింద ఉన్న రైతులు 55000 ఎకరాలు సాగు జరుగుతుందని ఆయన తెలిపారు.అయితే ఈ పనులకు సాగునీటి సంఘాల అధ్యక్షులు 100 రోజుల్లో పూర్తిచేసి రైతుల ఆదర అభిమానాలను చూడగుణాలని ఆయన కోరారు. తాండవ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాల సూర్య మాట్లాడుతూ నీటి భద్రత సాగినీటి సంఘాల బాధ్యత అనే కార్యక్రమాన్ని వంద రోజులు ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని దానికి సాగు నీటి సంఘాల నాయకులు పనులు గుర్తించి వంద రోజుల్లో పూర్తయ్యేలా చేయాలని ఆయన తెలిపారు. అనంతరం నాతవరంలో గల చీడిపెల్లి వారి చెరువు వద్దకు వెళ్లి ఎక్కడ తలుపులు అవసరం, పొర్లు కొట్టుకు మరమ్మతులు చేయాలా తదితర విషయాలను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, తాండవ ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ మేడపరెడ్డి జోగు బాబు, నర్సీపట్నం జడ్పిటిసి శుకల రమణమ్మ, మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్, పిఎసిఎస్ అధ్యక్షులు సింగంపల్లి సన్యాసి దేవుడు,అప్పిరెడ్డి మాణిక్యం,మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు,టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు ఇనప సప్పుల సత్యవతి,ఏవో జి.సుగుణ,ఏపీవో కొండాజి, మండల తెలుగు యువత అధ్యక్షులు పోలుపర్తి సాయి, గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షులు పైల సూరిబాబు,బిజెపి మండల పార్టీ అధ్యక్షులు సబ్బి కుమార్ స్వామి, మండల సోషల్ మీడియా కన్వీనర్ శెట్టి గోపి,ఇటంశెట్టి సీతారాం,పారుపల్లి దాసు,చింతకాయల శ్రీను,తాండవ ప్రాజెక్టు జేఈ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు సంఘం అధ్యక్షునీ పరామర్శించిన రామ్ మల్లిక్ నాయుడు..



**చీపురుపల్లి నియోజకవర్గం పెన్ పవర్ ఏప్రిల్ 06..** చీపురుపల్లి నియోజకవర్గం తెలుగుదేశం యువ నాయకులు తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు విశాఖపట్నం అమెరికన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మెరక ముడి దాం మండలం రైతు సంఘం అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణ రాజు(బుల్ రాజు) పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నరకముడిద మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాల ద్వారా 23 మందికి ఉద్యోగాలు

**బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ సూచన**





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 06 :** కారుణ్య కోటా కింద నియామకాలు పొందిన అభ్యర్థులు బాధ్యతతో పనిచేస్తూ మంచి ఉద్యో గులుగా గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సూచించారు. పనిలో నిబ ద్ధత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని, తమ విధులపై పూర్తి అవగాహన పెంపొందించుకో వాలని అన్నారు.సోమవారం సాయంత్రం కలెక్ట రేట్ వీసీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో, ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులు విధుల్లో ఉండగా మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారు ణ్య నియామకాల కింద 23 మందికి కలెక్టర్ నియామక పత్రాలు అందజేశారు.ఇందులో డిగ్రీ పూర్తి చేసిన ఎనిమిది మందికి సచివాలయాల్లో, ఏడుగురికి కలెక్టరేట్‌లో, ఒకరికి పోలీస్ కమిష నర్ కార్యాలయంలో, మిగిలిన ఏడుగురికి వివి ధ ప్రభుత్వ శాఖల్లో నియామకాలు కల్పించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయు డు, ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి. అప్పల నాయుడు, కలెక్టరేట్ ఇన్‌చార్జి ఏవో ఆనంద్ కుమార్, ఆర్టీసీ పీవో తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర విశ్వవిద్యాలయం మెగా కల్చరల్ ఫెస్ట్

- ముగింపు వేడుకలకు పవన్ కళ్యాణ్ కు ఆహ్వానం



**ఎ. యు.పెన్ పవర్, ఏప్రిల్ 06 :** ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న మెగా కల్చరల్ ఫెస్ట్ ముగింపు వేడుకలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను ఆహ్వానించారు. ఈ సంద ర్భంగా కార్యక్రమాల పోస్టర్‌ను ఆయన సోమవా రం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.ఏప్రిల్ 8 వ తేదీన నిర్వహించ నున్న ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని యూనివర్శిటీ అధికారులు పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా ఆహ్వాని స్తూ ఆహ్వాన పత్రం అందజేశారు.శతాబ్ది వేడు కల్లో భాగంగా ఈ మెగా కల్చరల్ ఫెస్ట్‌ను విశేషం గా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ పులిపాటి కింగ్, క్రీడా విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ మోహన్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ పల్లవి, రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మెంబర్ సెక్రటరీ కోటమరాజు శరత్ తదితరులు పాల్గొన్నారు.

# సృష్టిక్షేత్రానికి ఆటంకాలు సృష్టించవద్దు

**టిడిపి అధికార ప్రతినిధి లాలం శ్రీరంగస్వామి**



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఏప్రెల్ 06) :**నర్సీపట్నం మున్సిపాలిటీ పెద్ద చెరువు వద్ద నిర్మించనున్న సృష్టి క్షేత్రానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా, నిరాటంకంగా నిర్మాణం జరగాలని కోరుతూ వేములపూడి శివాలయంలో టిడిపి నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి లాలం శ్రీరంగస్వామి, ఎంపీటీసీ బోళెం రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాలం శ్రీరంగస్వామి మాట్లాడుతూ నర్సీపట్నం ముఖచిత్రాన్ని మార్చే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును అడ్డుకోవడం దారుణమన్నారు. నర్సీపట్నం ప్రజలందరూ ఈ సృష్టి క్షేత్రాన్ని పూర్తిచేయాలని ఆశిస్తుంటే, ప్రతిపక్ష నాయకుడు మాత్రం కోర్టును ఆశ్రయించి ఈ ప్రాజెక్టును అడ్డుకోవడానికి ప్రయత్నించడం సిగ్గుచేటు అన్నారు. మీ సొంత గ్రామం బాపిరాజు కొత్తపల్లిలో ఇదేవిధంగా చెరువులో కడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. అది దైవ కార్యం కాబట్టి అక్కడ మా నాయకులు సహకరిస్తున్నారని, ఆ విషయాన్ని గుర్తెరిగి ప్రవర్తించాలని మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సృష్టి క్షేత్రం పూర్తయితే ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా, పర్యాటక రంగంగా కూడా అభివృద్ధి చెందుతుందని, తద్వారా ఎంతోమంది చిరు వ్యాపారులకు ఉపాధి కలుగుతుందని తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన 108 అడుగుల ఈ శివపార్వతుల విగ్రహం ఏర్పాటుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తవాలని, అడ్డుకునే వ్యక్తుల మనసు మారాలని ఈరోజు శివాలయంలో పూజలు అభిషేకాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మెట్టపాలెం మాజీ సర్పంచ్ కూండ్రపు అర్జున్, లాలం గోవిందు, పైల గంగాధర్, కూండ్రపు సన్నిబాబు, రుత్తల గణపతి సత్యనారాయణ, జి. సహదేవుడు, అనిమిరెడ్డి రమణ, పైల కొండబాబు, నక్కా వేమేష్, చింతల అప్పలనాయుడు, కూండ్రపు కన్నాలనాయుడు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## విఆర్ఎల మార్చి నెల జీతాలు వెంటనే చెల్లించాలి....

### విఆర్ఏ ల సంఘ జిల్లా మన్యం అధ్యక్షుడు జి. ఈశ్వరరావు



**కురుపాం, పెన్ పవర్, ఏప్రిల్ 6:**రెవెన్యూ శాఖలో క్షేత్ర స్థాయిలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు (విఆర్ఎలు) మార్చి నెల జీతాలు వెంటనే చెల్లించాలని మన్యం జిల్లా విఆర్ఏ ల సంఘ జిల్లా అధ్యక్షుడు జి. ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఈ సందర్భంగా కురుపాం లో ఆయను పత్రిక విలేఖరులతో మాట్లాడతూ ఏప్రిల్ 6వ తేదీ వచ్చినప్పటికీ జీతాలు అందకపోవడంతో విఆర్ఎల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో నెలకు రూ.11,000 జీతంతో కుటుంబాన్ని పోషించడం కష్టమైందన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా జీతాలు పెంచకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇతర రాష్ట్రాల మాదిరిగా, ముఖ్యంగా తెలంగాణలో అమలవుతున్న విధంగా పే స్కేల్ జీతాలు ఇవ్వాలని ఆయన కోరారు. అదేవిధంగా విఆర్ఎలపై నిబంధనలకు విరుద్ధంగా నైట్ డ్యూటీలు వేస్తూ అదనపు పని భారం మోపుతున్నారని, వాటికి ప్రయాణ భత్యాలు కూడా ఇవ్వకపోవడం వల్ల ప్రతి నెలా అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందన్నారు.

తక్షణమే ప్రభుత్వం స్పందించి మార్చి నెల జీతాలు విడుదల చేయడంతో పాటు పే స్కేల్ అమలు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ఆర్వీనగర్, జీకేవీధి ఆశీస్సులు వేలంపాటు పూర్తి





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 6:** జీకేవీధి, ఆర్వీనగర్ వారపు సంతల ఆశీస్సులు వసూలు కోసం వేలంపాటలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. సోమవారం జీకేవీధి పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి గిరిబాబు ఆధ్వర్యంలో జీకేవీధికి సంబంధించి వేలంపాట నిర్వహించగా, మొత్తం నాలుగు మంది పోటీదారులు పాల్గొన్నారు.జీకేవీధి పూజారిపాకలు గ్రామానికి చెందిన సాగిన రాజు రూ. 92,000కే దక్కించుకున్నారు. ఆర్వీనగర్‌లో కూడా వేలంపాట నిర్వహించబడింది. ఇక్కడ మొత్తం ఐదు మంది పోటీదారులు పాల్గొన్నారు. జీకేవీధి గ్రామానికి చెందిన గెడ్డం నరేష్ రూ. 94,000కే దక్కించుకున్నారు అని ప్రత్యేక అధికారి గిరిబాబు తెలిపారు, జీకేవీధిలో సాగిన రాజు, ఆర్వీనగర్‌లో గెడ్డం నరేష్ వారికీ ఏడాది పాటు ఆశీస్సులు వసూలు చేసుకునే అవకాశం కల్పించబడింది. స్థానిక ఎంపీటీసీ రాజేశ్వరి ద్వారా పత్రాలు అందజేయబడ్డాయి.కార్యక్రమంలో ఈవోపీఆర్డి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, బిజెపి మండల అధ్యక్షుడు శేఖర్, గ్రామ పెద్దలు మొట్టడం రామారావు, లకే రామచంద్రుడు పాల్గొన్నారు.

## జీకే వీధిలో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 6:**గూడెం హెడ్‌క్వార్టర్స్‌లో మండల బీజేపీ అధ్యక్షులు కాకూరు శేఖర్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నది. "మన ఊరు, మన ఊరు, మన జెండా" అనే నినాదంతో పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక నేతలు కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ 1980 ఏప్రిల్ 6న స్థాపించబడిన తర్వాత 46 సంవత్సరాలు పూర్తి చేసి, 47వ సంవత్సరానికి అడుగుపెడుతూ, మండలంలో ఉన్న ముఖ్య నాయకులతో ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.కార్యక్రమంలో బిజెపి ఎంపీటీసీ రీమల రాజేశ్వరి, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి చల్లంగి అత్యుత్, జిల్లా నాయకులు ఎం. రామ్ కిరణ్ కుమార్, బోండ్ల చిరంజీవి, లకే రాము, రీమల పాల్, ఏం. సోమలింగం, జి. త్రినాథ్ పాల్గొన్నారు.

## పరారీలో ఉన్న గంజాయి నిందితుడు అరెస్ట్

- నిందితుడు గోవింద్ కు రిమాండుకు తరలింపు.
- ముంచంగిపుట్టు ఎస్ఐ పి నాని.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 06.**అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండల పరిధిలో గత 2024 అక్టోబర్ నెలలో అక్రమంగా గంజాయి తరలిస్తు పోలీసుల నుండి తప్పించుకుని తిరుగుతున్న ఏ5 ముద్దాయి గోవింద్ ఎట్టకేలాకు పోలీసులుకు చిక్కాడని స్థానిక ఎస్పై పి నాని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ పాత్రికేయులకు తెలిపిన వివరాల ప్రకారం.. 2024 అక్టోబర్ లో అక్రమ గంజాయి తరలిస్తూ తప్పించుకుని తిరుగుతున్న గోబిందును అదుపులో తీసుకున్నామని ఆయన అన్నారు. గోవింద్ ఒడిస్సా రాష్ట్రం, మల్కన్ గిరి జిల్లా, పనసపుట్ట పంచాయతీ, ఘనబేడా గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించమని ఆయన తెలిపారు. గోవింద్ ను అదుపులు తీసుకుని రిమాండ్ కి తరలించమని ఎస్పై తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

## చందనోత్సవానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు





**సమస్యలు లేకుండా విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశాలు**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 06:** శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి చందనోత్సవాన్ని ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతం గా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వ యంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభి షిక్త్ కిశోర్ అధికారులకు ఆదేశించారు. సోమవా రం కలెక్టరేట్‌లో కీలక శాఖల అధికారులతో ని ర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన స్పష్ట మైన మార్గదర్శకాలు జారీ చేశారు.గత అనుభ వాలను పరిగణలోకి తీసుకుని, అప్పటి లోపా లు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మేర కు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని, బాధ్యతలు నిర్వ ర్తించే ప్రతి శాఖ అధికారి అంకితభావంతో పనిచే యాలని ఆయన అన్నారు.

సమావేశంలో భాగంగా దేవస్థానం ఈవో జె. వెంకటరావు, ఆలయ పండితులు చందనోత్స వంలో నిర్వహించే సంప్రదాయ ఘట్టాలు, ఏర్పా ట్లపై వివరాలు అందించారు. వాటిని సమగ్రంగా విన్న కలెక్టర్, నిర్వహణలో ప్రతి అంశంపై అప్ర మత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించా రు.

భద్రతా ఏర్పాట్లను పోలీస్ శాఖ పర్యవేక్షించా లని, రవాణా సదుపాయాల విషయంలో ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. టిక్కెట్ల ముద్రణలో ఆలా నిబంధనలు పాటిస్తూ, రూ.1500 మరియు రూ.1000 టిక్కెట్లపై పికప్, డ్రాపింగ్ పాయింట్ల వివరాలు తప్పనిసరిగా పొందుపరచాలని ఆదేశించారు. వాహనాల ప్రవేశానికి పరిమిత సంఖ్యలోనే పాసులు జారీ చేయాలని పేర్కొ న్నారు.భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు వంటి మౌలిక వసతులు సమృద్ధిగా కల్పించాలని, అత్యవసర సేవల కోసం ఆధునిక అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసు కోవాలని సూచించారు.ఉత్సవాల సందర్భంగా మద్యం దుకాణాల తాత్కాలిక మూసివేతపై గత నిబంధనలు అమలు చేయాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. దాతలు ఏర్పాటు చేసే ఫుడ్ కౌంటర్లను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేసి, ఆహార నాణ్య తను నిర్ధారించాలని ఆదేశించారు.అన్ని ఏర్పా ట్లు ఏప్రిల్ 17 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయు డు, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, జీవీఎంసీ సిఎం నరేశ్, ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు, డీఎంహెచ్వో పి. జగదీశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## రింతాడలో ఆక్రమ నిర్మాణం పై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఏప్రిల్ 6**: మండలంలోని రింతాడలో గిరిజనేతరుడు 1/70 చట్టం ఉల్లంఘిస్తూ అక్రమ నిర్మాణం చేస్తున్నట్లు స్థానిక గిరిజనులు ఫిర్యాదు చేశారు.సోమవారం జీకేవీధిలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదును ఎంపీడీవో బిహెచ్వి రమణబాబుకు అందజేశారు.ఈ నిర్మాణంపై పూర్తి విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ అన్నాజీరావుకు సూచించారు. షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజన చట్టాలను ఎవరూ ఉల్లంఘించరాదు అని అధికారులు స్పష్టంగా పేర్కొన్నారు.

## గ్యాస్ సర్ఫరా లో వినియోగదారులు కష్టాలు.



**గుమ్మలక్ష్మీపురం ఏప్రిల్ 06 పెన్ పవర్:** మండలంలో జిసిసి గ్యాస్ కార్యాలయంలో వినియోగదారుల కష్టాలు.వినియోగదారులతో రద్దీగా మారిన గుమ్మలక్ష్మీపురం జిటిసి గ్యాస్ కార్యాలయం.ఈ మేరకు స్థానికులు మాట్లాడుతూ ఎల్పిజి గ్యాస్ సరఫరా లో యాజమాన్యం కొన్ని నిబంధనలు పెట్టడంతో గ్యాస్ దొరుకుతుందో లేదో అని ఆందోళన చెందుతున్నామని గ్యాస్ బుకింగ్ లో ఓటీపీల సమస్యలు ఉండడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నామని.ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు గ్యాస్ సర్ఫరాలో వినియోగదారులకు అనుకూలంగా ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.


## అధికారుల గైర్హాజరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీపీ.




**గుమ్మలక్ష్మీపురం ఏప్రిల్ 06 పెన్ పవర్.** మండలంలో గల స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నాడు జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ దీనమయ్య అధికారుల గైరహాజర్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.సమావేశానికి కొంతమంది అధికారులు హాజరు కాకపోవడం అసహనం వ్యక్తం చేస్తున్నానని.ముఖ్యమైన సమావేశలు నిర్వహించేటప్పుడు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల సమస్యలు ఏవిధంగా పరిష్కారం అవుతాయని బాధ్యత రైతంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఆయన మండిపడ్డారు.అధికారుల గైర్హాజరును తీవ్రంగా పరిగణిస్తున్నామని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపీపీ అన్నారు.

## గాలివాన బీభత్సంతో లబడపుట్టు రేకులు ధ్వంసం

- ప్రభుత్వ ఆదుకోవాలంటున్న బాధితులు.
- కుటుంబాలను బాధిత కుటుంబాలను పరామర్శించిన టిడిపి నేత చెండా బాబుజి.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 06.** అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలంలో గల మాకవరం పంచాయతీ, లబడ పుట్టు, మొక్క పుట్టు గ్రామాలలో ఆదివారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించాయి. రెండు గ్రామాల్లో సుమారు ఏడు కుటుంబాలకు సంబంధించిన ఇల్లు రేకులన్నీ భారీ ఈదురుగాలుల్లో పైకి ఎగిరి నేలనపడి ధ్వంసం అయ్యాయి. పశువుల శాలలు, చెట్లు నేలకొరిగాయి. గాలి వాన బీభత్సంతో తమ గృహాలను కోల్పోయిన బాధితులు నిరాశ్రయులుగా మిగిలారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఆదుకోవాలనీ బాధితులు విజ్ఞప్తి చేశారు. జరిగిన సంఘటనను తెలుసుకొని టిడిపి నేత చెండా బాబుజి సోమవారం లబడపుట్టు మొక్కపుట్టు గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించి, జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కపుట్టు, లబడపుట్టు గ్రామాలకు చెందిన పాంగి గురు, వంతాల హరి, వంతాల బొజ్జయ్య, లోచ్మ, మండి మంగరాజు, పాంగి రాధమ్మ, పాంగి భాను, పాంగి కాంతమ్మ, వంతాల జమున, అడికటియ సోమరి, కొర్ర డొమిని అను వారి గృహాల్లో రేకులు ధ్వంసమయ్యాయి అన్నారు. చెట్లు, పశువుల శాలలు కూలయని, జరిగిన ఘటనపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆదుకునేలా చూసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిసా ఉపాధ్యక్షులు డి పులంధర్, ఆయా గ్రామస్తులు రాజేంద్ర బాబు, బాబురావు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com